
# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 251 | హైదరాబాద్ | మంగళవారం 31-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00

11లో

ఇరాన్‌కు ఏప్రిల్ 6 డెడ్‌లైన్..
చమురు క్షేత్రాలే తమ టార్గెట్ అన్న ట్రంప్

## దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన..
## 'సహజీవన జంటలకు' కూడా కుటుంబ హోదా




11లో

- 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన జనగణన ప్రక్రియ
- ఈసారి జనాభా లెక్కల్లో సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల మార్పు
- వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసలైన జనాభా లెక్కల సేకరణ
- జనాభా లెక్కల కోసం 33 ప్రశ్నలతో ప్రశ్నావళి సిద్ధం

## కేసీఆర్ ను గృహ నిర్బంధం చేశారనేది
# నా అనుమానం: రేవంత్ రెడ్డి

- రావణుడి వల్లే రాముడి గొప్పతనం తెలిసిందన్న రేవంత్
- కేసీఆర్ ఉండటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందని వ్యాఖ్య
- నియోజకవర్గాల పెంపుతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న సీఎం
- కేంద్రానికి ఐదు ఉత్తరాది రాష్ట్రాలు సరిపోతాయని వ్యాఖ్య

11లో



## న్యాయవాదుల రక్షణ కోసం
## ప్రొటెక్షన్ బిల్లు: మంత్రి శ్రీధర్ బాబు

అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకువస్తామన్న మంత్రి



11లో

## 'హేట్ స్పీచ్' బిల్లు..
## ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే



11లో

- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'హేట్ స్పీచ్' బిల్లుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే ఈ చట్టం తెస్తున్నారని ఆరోపణ
- బిల్లులోని నిబంధనలు అస్పష్టంగా, దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తాయన్న కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే జైలుకు పంపే ప్రమాదం ఉందని హెచ్చరిక
- బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్




11లో

## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్..
## రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- దేశవ్యాప్తంగా మరో 11 విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా వర్చువల్ ప్రారంభోత్సవం
- ఈ కేఫ్‌లలో రూ.10కే టీ, వాటర్ బాటిల్, రూ.20కే స్నాక్స్
- స్థానిక రుచులకు ప్రాధాన్యత.. ప్రయాణికుల నుంచి ప్రశంసలు

## మాకు అవసరం లేదు
## మధ్యవర్తిత్వం వహిస్తానన్న పాకిస్థాన్‌కు ఇరాన్ షాక్

- అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు ఆతిథ్యం ఇస్తామన్న పాకిస్థాన్
- సౌదీ సహా పలు దేశాల మంత్రులతో పాకిస్థాన్ చర్చలు
- పాకిస్థాన్ ప్రణాళికలతో తమకు సంబంధం లేదన్న ఇరాన్

11లో



## రెండున్నర లక్షల మంది పేదలతో
## గృహ ప్రవేశం చేయించిన చంద్రబాబు

- నాయుడుపేట వేదికగా పేదలకు ఇళ్ల పంపిణీ చేసిన చంద్రబాబు
- తన జన్మ ధన్యమైందంటూ ముఖ్యమంత్రి భావోద్వేగం
- పేదలు గౌరవప్రదమైన ఇళ్లలో ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్య

11లో





11లో

## శ్మశానంలో గ్యాస్ సిలిండర్ల దందా..
## హైదరాబాద్‌లో రాకెట్ గుట్టురట్టు

- హైదరాబాద్‌లో భారీ గ్యాస్ హోర్డింగ్ రాకెట్ బట్టబయలు
- బంజారాహిల్స్ శ్మశానంలో 414 సిలిండర్లు స్వాధీనం
- గ్యాస్ ఏజెన్సీ యజమాని సహ 10 మంది అరెస్ట్
- గల్ఫ్ యుద్ధం కారణంగా ఏర్పడిన కొరతను ఆసరాగా చేసుకుని దందా

## దక్షిణ సూడాన్‌లో నరమేధం..
## 70 మంది మృతి



- దక్షిణ సూడాన్‌లో బంగారు గనిపై సాయుధుల దాడి
- ఈ ఘటనలో 70 మందికి పైగా పౌరులు మృతి
- రాజధాని జుబా సమీపంలోని జెబెల్ ఇరాక్ గని వద్ద ఘటన
- గని వద్ద వివాదమే దాడికి కారణమని ప్రాథమిక సమాచారం
- అక్రమ మైనింగ్, సాయుధ గ్రూపుల మధ్య ఘర్షణలే కారణమంటున్న విశ్లేషకులు

11లో

# సంపాదకీయం

## జాతీయ ప్రయోజనాల రక్షణకు...

అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం చమురు, సహజ వాయువు సంక్షోభాన్ని సృష్టించి ఆర్థిక వ్యవస్థలను పెనుమంటల్లోకి నెట్టింది. హర్మ్యాజ్ జలసంధి, ఎర్ర సముద్రంలో నౌకల రాకపోకలకు, విమానయానానికీ ఆటంకాలు ఏర్పడటంతో ఇండియా నుంచి గల్ఫ్‌కు బియ్యం, అరటి పండ్లు, గుడ్లు, సుగంధ ద్రవ్యాలు, వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు వంటివాటి ఎగుమతులు నిలిచిపోయాయి. నిరుడు భారత్ నుంచి రూ.లక్ష కోట్ల విలువైన వ్యవసాయ, ఆహార ఉత్పత్తులు ఆ దేశాలకు తరలివెళ్లాయి. ప్రస్తుతం సముద్ర మార్గంలో ఇరాన్ దాడుల భయంతో సంబంధిత కంపెనీలు నౌకలకు బీమా ప్రీమియాలను పెంచేశాయి. ఓడలు ఆఫ్రికాను చుట్టి రావాల్సివస్తుండటంతో సరఫరాలు ఆలస్యమవుతున్నాయి. దీనికితోడు ఇంధన ధరలకు రెక్కలు రావడంతో ఎంఎస్ఎంఈలకు కావాల్సిన ముడిపదార్థాల వ్యయాలు 40శాతం దాకా అధికమై ఉత్పత్తి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇప్పటికే అరకొర లాభాలతో నెట్టుకొస్తున్న ఆ సంస్థలకు ఇది గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలతో తీవ్రంగా ప్రభావితమైన వ్యాపారాలకు వ్యవస్థాగతంగా సాయమందించాల్సిన అవసరాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదిక తాజాగా ప్రస్తావించింది. ఆ మేరకు తగిన చర్యలు తీసుకుంటూనే దేశ దీర్ఘకాలిక ప్రయోజనాల రక్షణకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేయాలి!

అమెరికా తరవాత అత్యధికంగా 40 కోట్ల ఎకరాల మేరకు సాగుయోగ్యమైన భూములు ఉన్నా, దేశీయంగా వినియోగిస్తున్న వంటనూనెల్లో 60శాతం విదేశాల నుంచే వస్తున్నాయి. పప్పు ధాన్యాలకూ దిగుమతులే దిక్కవుతున్నాయి. ఈ రెండింటి కోసమే 2024-25లో రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా భారత్ వెచ్చించింది. ఈ పరాధీనత వల్ల ఎక్కడ ఎలాంటి యుద్ధాలు తలెత్తినా మన దేశంలో నూనెలూ పప్పులు ప్రియమవుతున్నాయి. ప్రస్తుత పశ్చిమాసియా పోరు కారణంగా వంటనూనెల ధరలు రూ.15 నుంచి రూ.20కి పైగా పెరిగాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తొలినాళ్లలో పొద్దుతిరుగుడు నూనె వెల 50శాతం అధికమైంది. శాస్త్రీయ పంట ప్రణాళికలతో రైతాంగానికి సరైన దిశానిర్దేశం చేస్తూ, మద్దతు ధరల కల్పనలతో అన్నదాతలకు అండగా ఉంటేనే వ్యవసాయ ఉత్పత్తులన్నింటిలో స్వావలంబన సాధ్యపడుతుంది. ఇంకోపక్క ఇంధన అవసరాల్లో ఎనభై అయిదు శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి వస్తోంది. అందులోనూ 50శాతం చమురు, 90శాతం వంట గ్యాస్ పశ్చిమాసియా నుంచే రావాలి. దాంతో అక్కడ కల్లోలం చెలరేగితే సామాన్యులకు ఇక్కట్లు తప్పట్లేదు. వాటిని నివారించి, ఇంధన భద్రతను పటిష్ఠపరచుకునేందుకు బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి. గల్ఫేతర దేశాలతో ఇంధన కొనుగోలు ఒప్పందాలను విరివిగా కుదుర్చుకోవాలి!

వైద్య పరికరాలు, ముడి ఔషధాలకోసమూ విదేశాల వైపు చూడాల్సి వస్తోంది. ఎడతెగని యుద్ధాలతో సరఫరా గొలుసులు విచ్ఛిన్నమై నేడు సర్జికల్ వస్తువుల ధరలు అధికమయ్యాయి. దేశీయంగా వైద్య సామగ్రి తయారీకి ఊతమిస్తే ప్రజారోగ్య రంగానికి కొత్త జవసత్వాలు అందుతాయి. అలాగే, ఎరువులకోసం పరదేశాలపై ఆధారపడటమూ భారత వ్యవసాయానికి దీర్ఘకాలంలో చేటుచేస్తుంది. మన సాగు సురక్షితం, సుభిక్షం కావాలంటే నానో యూరియా, సహజ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. అన్నింటికీ దిగుమతులే దిక్కవుతుంటే వాణిజ్యలోటు పెరిగిపోయి, రూపాయి విలువ పతనమవుతుంది. అది మరిన్ని సమస్యలను కొనితెస్తుంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లోని అస్థిరతలు మన ప్రగతిని హరించకూడదంటే- దేశీయ తయారీని చురుకెత్తించి అన్ని రంగాల్లో ఆత్మనిర్భరత సాధించాలి. అందుకోసం పాలకులు నిర్దేశిత గడువులోగా ఫలితాలు సాధించే ఆచరణాత్మక వ్యూహాలను అనుసరించాలి!

# రాజధాని మార్పు సాధ్యం కాదా...

గుంటూరు, మార్చి 30,

రాజధానికి చట్టబద్ధత కల్పించేందుకు తీర్మానం చేసింది ఏపీ అసంబ్లీ. కేంద్రం కూడా విభజన చట్టంలో పెట్టేస్తుంది. అంత వరకూ బాగానే ఉంది. కానీ జగన్ సీఎం అయితే రాజధానిని మార్చలేరన్న ప్రచారం మాత్రం అవాస్తవం. మన దేశంలో అమలు చేసినవే చట్టాలు. అమలు చేయకూడదనుకుంటే..దాని కోసం పాలకులు ఎన్నో మార్గాలు వెదుకుతారు. రాజధాని విషయంలో చట్టబద్ధత ఉంటే ఇక మార్పు అసాధ్యం అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. వ్యవస్థలను ఎలా వాడుకోవాలో, చట్టాల్లోని లొసుగులను ఎలా వెతకాలో తెలిసిన పాలకులకు ఏదీ అసాధ్యం కాదు.విభజన చట్టంలో అమరావతి పేరు చేర్చినంత మాత్రాన అది శాశ్వతం అయిపోదు. చట్టాలు అనేవి పాలనను క్రమబద్ధం చేయడానికి ఉంటాయి కానీ, పాలకుల పట్టుదలను అడ్డుకోలేవు. గతంలో మూడు రాజధానులు అనే ప్రతిపాదన తెచ్చినప్పుడు, అమరావతిని తీసేస్తున్నామని వారు ఎక్కడా చెప్పలేదు. కానీ, అభివృద్ధిని ఆపేయడం ద్వారా, నిధులను మళ్లించడం ద్వారా ఆ ప్రాంతాన్ని ఒక ఎడారిగా మార్చగలిగారు. అంటే, చట్టాన్ని మార్చకపోయినా, దాని ప్రాధాన్యతను తగ్గించే నిర్వీర్య ప్రక్రియ రాజకీయంగా చాలా సులభం.ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అక్కడే అధికారం ఉంటుందనేది జగన్ చెప్పేమాట. విశాఖలోని రుషికొండపై నిర్మించిన భవనాలు కేవలం గెస్ట్ హౌస్‌లు మాత్రమే కావు, అవి ఒక సమాంతర సచివాలయానికి పునాదులు. చట్టం ప్రకారం రాజధాని అమరావతిలోనే ఉన్నా, క్యాంప్ ఆఫీస్ పేరుతో పాలకుడు విశాఖ నుంచే చక్రం తిప్పవచ్చు. జగన్ అమరావతిని రాజధానిగా కొనసాగిస్తానని ప్రకటన చేసి.. సీఎంకాగానే రాజధాని నిర్మాణానికి అవసరమైన రూ. 50 వేల కోట్ల ప్రాజెక్టును అర్ధాంతరంగా ఆపేయడం, అంతర్జాతీయ సంస్థలైన వరల్డ్ బ్యాంక్ వంటి వాటిని వెనక్కి వెళ్లేలా చేశారు. తర్వాత సీఎం అయినా ఇలా చేయరన్న గ్యారంటీలేదు.రాజధాని అంటే కేవలం భవనాలు కాదు, అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ. ఐటీ కంపెనీలు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు అన్నీ నమ్మకం మీద ఆధారపడి వస్తాయి. పాలకుడు మారినప్పుడల్లా రాజధాని మారుతుందన్న భయం ఉంటే ఏ పెట్టుబడిదారుడూ ఏపీ వైపు చూడడు. యువతకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే నిలకడైన పాలన, రాజధాని పట్ల స్పష్టమైన విజన్ ఉన్న నాయకత్వం అవసరం. గందరగోళం సృష్టించే ధోరణి ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే, చట్టం ఉన్నా లేకపోయినా అభివృద్ధి కుంటుపడుతుంది.అమరావతిని ఎవరూ మార్చలేరు అనే ధీమా మంచిదే. కానీ మార్చబోము .. అమరావతిని అభివృద్ధి చేస్తామని వైసీపీ ఇప్పటికీ ప్రకటించలేదు. ప్రకటించినా నమ్మే పరిస్థితుల్లో జనం లేరు. రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలను వాడుకుని, వ్యవస్థలను మేనేజ్ చేసి, ఒక ప్రాంతాన్ని పనికిరాకుండా చేసే శక్తి అధికారంలో ఉన్న వారికి ఉంటుంది. ఆ పని గతంలో జగన్ చేశారు. వస్తే మళ్లీ చేస్తారు. రాజధాని మనుగడ అనేది కేవలం చట్టం మీద కాదు, ఆ చట్టాన్ని అమలు చేసే వ్యక్తి ఉద్దేశం మీద ఆధారపడి ఉంటుంది. ఏపీ భవిష్యత్తు నిలవాలంటే, రాజధానిని ఒక సెంటిమెంట్ గా కాకుండా 'కమిట్‌మెంట్' గా భావించే నాయకత్వం కొనసాగాల్సిన అవసరం ఉంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చను ప్రారంభిస్తూ గత ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచస్థాయి రాజధానిని నిర్మించాలనే సంకల్పంతో 34 వేల ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారు. కానీ, జగన్ మోహన్ రెడ్డి కేవలం రాజకీయ కక్షతో రాజధానిని స్మశానంగా మార్చారు అని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల ముసుగులో అమరావతిని అనాథను చేశారని, రైతులను రోడ్డున పడేసిన పాపం గత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు చేస్తున్న తీర్మానం అమరావతికి రక్షణ కవచంలా మారుతుందని భరోసా ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. అమరావతి అనేది కేవలం ఒక కులానికో, ప్రాంతానికో చెందింది కాదు.. అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం అని గర్జించారు. జగన్ సర్కార్ రాజధానిని చెరబట్టి రాష్ట్ర భవిష్యత్తును పదేళ్లు వెనక్కి నెట్టేసిందని విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకుండా పారిపోయారని, కనీసం తప్పు ఒప్పుకునే ధైర్యం కూడా వారికి లేదని ఎద్దేవా చేశారు. అమరావతిని వెలుగుల జిలుగుల నగరంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు.ఐదేళ్ల పాలనను సైకో పాలన గా నారా లోకేష్ అభివర్ణించారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక గ్రాఫిక్స్ అంటూ అబద్ధాలు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇన్సైడర్ ట్రేడింగ్ పేరుతో బురదజల్లి, కోర్టుల చుట్టూ తిప్పి కాలయాపన చేశారని దుయ్యబట్టారు. ఇప్పుడు అమరావతికి కేంద్రం నుంచి నిధులు రాబట్టడమే కాకుండా, చట్టబద్ధత కల్పించి ఏ శక్తీ అడ్డుకోలేని విధంగా అభివృద్ధి చేస్తామని లోకేష్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో అమరావతి రైతులపై జరిగిన దాడులు, అక్రమ కేసులను అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. బీజేపీ సభ్యుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉందని, విభజన చట్టం సవరణ ద్వారా దీనికి మరింత బలం వస్తుందని పేర్కొన్నారు. విష్ణుకుమార్ రాజు వంటి నేతలు కూడా జగన్ ప్రభుత్వం చేసిన రాజధాని ద్రోహం ను అంకెలు, సాక్ష్యాలతో సహా వివరించారు.ఈ చర్చకు వైసీపీ హాజరుకాకపోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బగా మారింది. కూటమి నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టే అవకాశం ఉన్నా, సభను బహిష్కరించడం ద్వారా వైసీపీ తన ఓటమి ని అంగీకరించినట్లయింది. తప్పు ఒప్పుకున్నట్లయింది.

# కడపలో స్టీల్ ప్లాంట్ అడుగులు

కడప, మార్చి 30

ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె పరిసరాల్లో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి, సుమారు 3 వేల ఎకరాలకు పైగా భూమిని జిందాల్ స్టీల్ ఆంధ్ర లిమిటెడ్ సంస్థకు అప్పగిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దశాబ్దాలుగా రాయలసీమ ప్రజల కలగా ఉన్న ఈ ఉక్కు పరిశ్రమ సాకారం కావడానికి ఈ భూముల బదిలీ ఒక ప్రధాన మలుపుగా భావిస్తున్నారు.గతంలో ఈ ప్రాజెక్టు కోసం వివిధ సంస్థలతో చర్చలు జరిగినప్పటికీ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉక్కు ఉత్పత్తి చేసేందుకు జిందాల్ గ్రూప్ ముందుకు వచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా ఏటా దాదాపు 3 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిందాల్ సంస్థ సుమారు రూ. 8,883 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. భూమి అప్పగింత ప్రక్రియ పూర్తి కావడంతో, ఇక ప్లాంట్ నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.ఈ ప్రాజెక్టు వల్ల రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి ఊపందుకోవడమే కాకుండా, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వేల సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన కడప జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అనుబంధ పరిశ్రమలు కూడా వెలిసే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్ రహదారి సౌకర్యాలను కల్పించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది.భూసేకరణ సమయంలో స్థానిక రైతుల నుంచి వచ్చిన అభ్యర్థనలు, పరిహారం పంపిణీ వంటి అంశాలను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించింది. వైసీపీ హాయంలో శంకుస్థాపన జరిగినప్పటికీ.. భూ సమస్యలను



పరిష్కరించకపోవడంతో పట్టాలెక్కలేదు. ఇప్పుడు ప్రభుత్వం అన్నీ పరిష్కరిస్తోంది. జిందాల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టడం వల్ల నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తవుతుందని అటు రాజకీయ వర్గాలు, ఇటు పారిశ్రామిక నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ పారిశ్రామిక ముఖచిత్రంలో కడప స్టీల్ ప్లాంట్ ఒక మైలురాయిగా నిలవనుంది.స్టీల్ ప్లాంట్ నిర్మించాలన్నది దశాబ్దాల కల. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది గత కొన్నేళ్లుగా ఆలోచన. ఎట్టకేలకు అది కార్యరూపం దాల్చబోతోంది. ఈ పరిశ్రమ కోసం సేకరించిన మూడువేల ఎకరాలకు పైగా భూమిని జిందాల్ స్టీల్ ఆంధ్ర పరిశ్రమకు బదలాయించింది కూటమి ప్రభుత్వం. అందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. దశాబ్దాల కల నెరవేరే రోజు ఆసన్నం అయ్యింది. గతంలో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు చాలా కంపెనీలతో చర్చలు జరిగాయి. అయితే అత్యున్నత ప్రమాణాలతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి జిందాల్ స్టీల్ ఆంధ్ర కంపెనీ ముందుకు వచ్చింది. ఈ కంపెనీ దాదాపు మూడు మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

జిందాల్ స్టీల్ ఆంధ్ర కంపెనీ సుమారు రూ.8,883 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. ప్రధానమైన భూ బదలాయింపు జరగడంతో మిగిలిన పనులు మొదలు పెట్టనుంది జిందాల్వెనుకబడిన జిల్లాగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది.

శంకుస్థాపన కూడా చేసింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిహారం పంపిణీ పూర్తి అయ్యింది. మరోవైపు ప్లాంట్ కు అవసరమైన మౌలిక వసతుల కల్పన పై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. రహదారులతోపాటు తాగునీరు అందించాలని నిర్ణయించింది. మొత్తానికి అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఒక ముందడుగు పడినట్లు అయ్యింది.

# బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి భాష

రాయచోటి, మార్చి 30:

రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాని కార్యదర్శిగా రెడ్డి భాష ఎన్నికయ్యారు సోమవారం జరిగిన బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్నికలలో× 110 ఓట్లకు 74 ఓట్లు రెడ్డి భాష సాధించారు.రాయచోటి నియోజకవర్గం లోని సంబేపల్లి మండలం లోని రౌతు గుంట గ్రామానికి చెందిన రెడ్డి భాష నిజాయితీ నిబద్ధతతోనే 40 ఓట్ల మెజారిటీ సాధించారని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ ప్రభాకర్ రెడ్డి ప్రశంసించారు. 2026 2026-27 సంవత్సరానికి గాను జరిగిన న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా తన ప్రత్యర్థి పై 40 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన పి. రెడ్డి భాషాను రాయచోటి న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. రాయచోటి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ ప్రభాకర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని న్యాయ-ంవాదులు అందరి తరపున ప్రధాన కార్యదర్శి పి. రెడ్డి భాష ను ఘనంగా సన్మానించారు. గత 15 సంవత్సరాలుగా రాయచోటి బార్ అసోసియేషన్ ఆదాయ వ్యయాల రికార్డులను కచ్చితంగా వ్రాసిన చరిత్ర ఒక రెడ్డి భాషా కే దక్కుతుందని ఆయన అన్నారు. అందుకే న్యాయవాదులు అందరూ కూడా అతనిపై నమ్మకం ఉంచి రెండవ సారి కూడా ప్రధాన కార్యదర్శిగా 40 ఓట్ల అత్యధిక మెజారిటీతో గెలిపించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మీదేవి, సహాయ కార్యదర్శి వి.సిద్దయ్య, ట్రెజరర్ కృష్ణమ , లైబ్రరీ సెక్రటరీ మహబూబ్జాన్ స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ టీవీ రమణ , న్యాయవాదులు శెట్టిపల్లి ప్రభాకర్ రెడ్డి, రాజ్ కుమార్ రాజు ఆనంద్ కుమార్, టి ఈశ్వర్ హుమయున్ భాష, దేవేందర్ రెడ్డి ధనుంజయ్ కుమార్ ఉదయగిరి రామాంజులు వీరభద్రయ్య,ఎం రవిశంకర్ నిరంజన్, టీవీ రమణ, సుబ్బరాయుడు హరీష్, మల్లికార్జున నాగేంద్ర, ఇర్షాద్, రామచంద్ర, శివకుమార్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# సిక్కోలులో దువ్వాడ రాజకీయం

శ్రీకాకుళం, మార్చి 30,

: శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. దశాబ్దాలుగా ఇక్కడ రాజకీయం కింజరాపు వర్సెస్ ధర్మాన ఫ్యామిలీ అన్నట్టు ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధర్మాన.. టిడిపి అధికారంలోకి వస్తే కింజరాపు కుటుంబాల హవా ఉంటుంది. అదే చాలామంది రాజకీయ పార్టీల నేతలకు మింగుడు పడని విషయం. ఇప్పుడు అటువంటి సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు దువ్వాడ శ్రీనివాస్. ఆ రెండు కుటుంబాల మధ్య రాజకీయ అనైతిక బంధం కొనసాగుతోందని ఆయన చెబుతున్నారు. గత కొద్ది కాలంగా ఇదే విషయాన్ని పదేపదే హెచ్చరిస్తూ వచ్చారు. ఇప్పుడు ఏకంగా ఆ రెండు కుటుంబాలకు గట్టి వార్నింగ్ ఇస్తున్నారు. దువ్వాడ శ్రీనివాస్ కు నేరుగా రాజకీయ ప్రత్యర్థి కింజరాపు ఫ్యామిలీ కాగా.. ఒకే పార్టీలో ప్రత్యర్థులు ధర్మాన సోదరులు. ప్రస్తుతం వ్యక్తిగత కుటుంబ వ్యవహారాలతో వైసిపి సస్పెన్షన్ వేటులో ఉన్నారు దువ్వాడ శ్రీనివాస్. అయితే వైసీపీలో తన సస్పెన్షన్ కు ధర్మాన, కింజరాపు కుటుంబాలే కారణమని కోపంతో రగిలిపోతున్నారు.అయితే దువ్వాడ శ్రీనివాస్ మాత్రం విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తన మనసునిండా జగన్మోహన్ రెడ్డి ఉన్నారని చెబుతున్నారు. అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ధర్మాన సోదరులు తనను సస్పెండ్ చేయించారని చెప్పుకొస్తున్నారు.

అయినా సరే పార్టీలోకి వస్తానని తేల్చి చెప్తున్నారు. జగన్ మాత్రం ఏం సినిమా హీరో అనుకుంటున్నావా అని వ్యంగ్యంగా అడుగుతున్నారు. అదే సమయంలో కింజరాపు కుటుంబం పై కూడా నోరు పారేసుకుంటున్నారు.

నా వెంట్రుక కూడా పీకలేరు అంటూ బాబాయ్ అబ్బాయిలను హెచ్చరిస్తున్నారు. తను చెప్పాలనుకున్నది చెబుతున్న దువ్వాడ శ్రీనివాస్ మాటను ఎవరు వినే పరిస్థితిలో లేరు. జగన్ పై అభిమానం కొండంత ఉంది. కానీ వైసీపీలో చోటు లేదు. ధర్మాన కుటుంబం పార్టీని నాశనం చేసిందని చెబుతున్నారు. కానీ వారు లేకుండా ఇప్పుడు జిల్లాలో పార్టీ లేదు. కింజరాపు ఫ్యామిలీ ఏం చేయలేదని చెబుతున్నారు. కానీ జిల్లాలో ఆ కుటుంబానికి మంచి ఆదరణ ఉంది. అందుకే ఇప్పుడు దువ్వాడ శ్రీనివాస్ సొంత యూట్యూబ్ ఛానల్ పెట్టుకుని కింజరాపు, ధర్మాన కుటుంబం పై ఓ రేంజ్ లో విరుచుకుపడుతున్నారు.శ్రీకాకుళం జిల్లాలో మూలపేట కోర్టు నిర్మాణం దాదాపు చివరి దశకు వచ్చింది. అయితే ఆ పోర్టు తమ ప్రభుత్వ హయాంలో జరిగిందని వైసిపి, ఇటు టిడిపి క్రెడిట్ కోసం ఆరాటపడుతున్నాయి. ధర్మాన సోదరుల నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీమూలపేట కోర్టు సందర్శనకు సిద్ధపడింది. దీంతో మళ్లీ దువ్వాడ శ్రీనివాస్ కు కోపం వచ్చింది.

పళ్ళు కొరుకుతూ రగిలిపోతూ కనిపించారు దువ్వాడ శ్రీనివాస్. ఆ పోర్టు క్రెడిట్ జగన్మోహన్ రెడ్డిదని.. తరువాత తనదేనని చెప్పుకొచ్చారు దువ్వాడ. అయితే దువ్వాడ తాను అభిమానించే జగన్ వద్దకు వెళ్లలేకపోతున్నారు. తాను సాధించానని చెబుతున్న మూలపేట పోర్టును సందర్శించలేకపోతున్నారు. అందుకే ఇప్పుడు ఆ రెండు కుటుంబాలపై పడ్డారు దువ్వాడ. సోషల్ మీడియాలో దీనిపైనే సెటైర్లు పడుతున్నాయి.

# పార్టీలు మార్పులు తప్పవా

విజయవాడ, మార్చి30,
ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాయకుల పాత్ర మరింత కీలకంగా మారుతున్నది. గత ఎన్నికల సమయంలోనే చాలా మంది నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలను మార్చడం కనిపించింది. ఎవరికైతే ఎక్కడ అవకాశాలు కనిపించాయో, వారు ఆ దిశగా అడుగులు వేసిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ , జనసేన, వైసీపీ ఇలా ఏ పార్టీలో చూసినా ఎన్నికల ముందు మార్పులు కనిపిస్తూనే ఉంటాయి.గెలిచిన వారు తమ స్థాయిని పెంచుకోగా, ఓడిన వారు కొత్త అవకాశాల కోసం మళ్లీ రాజకీయ సమీకరణలను పరిశీలిస్తున్నారు.రాబోయే ఎన్నికల నాటికి ఈ మార్పులు మరింత వేగంగా జరుగుతాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో, రాజకీయ నాయకులకు మరింత స్వేచ్ఛ లభించనుంది. ఇది ఒకవైపు పార్టీలకు కూడా అవసరం అవుతుంది. ఎందుకంటే కొత్త సీట్లు పెరిగినప్పుడు సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం కీలకం అవుతుంది. అందువల్ల గెలుపు సామర్థ్యం ఉన్న నాయకులను ఆకర్షించేందుకు పార్టీలు కూడా ముందుకు రావాల్సి ఉంటుంది.గత ఎన్నికల సమయంలో టికెట్ల కోసం జరిగిన రాజకీయ మార్పులు అందరికీ గుర్తున్నాయి. చాలామంది నాయకులు తమకు టికెట్ వచ్చే అవకాశాలను బట్టి పార్టీలు మార్చుకున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు కూడా గెలుపు గుర్రాలుగా భావించిన నాయకులను ప్రత్యేకంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నాయి. ఈ విధంగా ఇరువర్గాల మధ్య పరస్పర ఆధారపడే పరిస్థితి ఏర్పడింది.ఇప్పటి పరిస్థితుల్లో ఈ ధోరణి మరింత పెరిగే అవకాశముంది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడతాయి. కొత్త ప్రాంతాలు, కొత్త ఓటరు సమీకరణాలు రావడం వల్ల నాయకులు తమకు అనుకూలంగా ఉండే పార్టీలు లేదా వర్గాలను ఎంచుకునే స్వేచ్ఛ పొందుతారు.
దీంతో రాజకీయాల్లో వ్యక్తిగత నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది.అయితే ఈ స్వేచ్ఛకు మరో కోణం కూడా ఉంది. నాయకులు తరచూ పార్టీలు మారడం వల్ల రాజకీయ స్థిరత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని కొందరు విశ్లేషకులు అంటున్నారు.
2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అప్పట్లో అనేక మంది నాయకులు తమకు అనుకూలంగా పార్టీలను మార్చుకుని రాజకీయంగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకున్నారు.ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొందరు నాయకులు పార్టీ పట్ల నిబద్ధత చూపుతారా లేక వ్యక్తిగత ప్రయోజనాలను ముందుకు పెట్టుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.
ప్రజల అభిప్రాయం కూడా ఈ విషయంలో కీలకంగా మారే అవకాశం ఉంది. మరోపక్క ఇలా పార్టీలు మారిన వారికి పదవులు కట్టు పెట్టడం వల్ల కొన్ని సంవత్సరాలుగా పార్టీని నమ్ముకున్న వారి మనోభావాలు దెబ్బతింటున్నాయి. మొత్తంగా చూస్తే ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణం పవర్ఫుల్ నాయకులకు అనుకూలంగా మారుతోంది. ఈ అవకాశాన్ని వారు ఎలా వినియోగించుకుంటారన్నది రాబోయే రోజుల్లో స్పష్టతకు వస్తుంది. భవిష్యత్తులో రాజకీయ సమీకరణాల్లో మార్పులు తప్పవని సంకేతాలు కనిపిస్తున్నాయి.

# పార్లమెంట్ లో వైసీపీ స్టాండ్ ఏంటీ

నెల్లూరు, మార్చి 30
ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు ప్రస్తుతం తీవ్ర విభజనతో సాగుతున్నాయి. ఇక్కడ రాజకీయ పార్టీలు ఒకరినొకరు ప్రత్యర్థులుగా కాకుండా శత్రువులుగా చూసుకునే స్థాయికి చేరుకున్నాయని అనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండగా, ప్రజాస్వామ్య సంప్రదాయాలు కూడా చాలా వరకు కనుమరుగయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కనిపించే చర్చా సంస్కృతి, పరస్పర గౌరవం వంటి అంశాలు ఏపీలో కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధ హోదా కల్పించాలనే అంశంపై రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించి తీర్మానం ఆమోదించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అదే సమయంలో శాసన మండలి లో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టకపోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దీనిపై విమర్శలు చేస్తూ, ఇది కేవలం రాజకీయ నాటకమని ఆరోపిస్తోంది.రెండు సభలు ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమైన అంశాలను రెండింటిలోనూ చర్చించడం సాధారణ పద్ధతి. కానీ ఈ సందర్భంలో పరిస్థితి భిన్నంగా మారింది. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ వారు చర్చకు దూరంగా ఉండటం



గమనార్హం. మరోవైపు మండలిలో వైసీపీకి బలం ఎక్కువగా ఉండడంతో అక్కడ చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిని రాజకీయ వ్యూహంగా చూడాలని కొందరు అభిప్రాయపడుతున్నారు.అయితే ఈ అంశంలో కూటమి ప్రభుత్వం కూడా తన నిర్ణయాన్ని స్పష్టంగా తీసుకుందని అంటున్నారు. అమరావతి విషయంలో రాష్ట్ర శాసనసభ తీర్మానం కేవలం అభిప్రాయాన్ని తెలియజేయడానికే పరిమితమని నిపుణులు చెబుతున్నారు. ఇది చట్టం చేసే ప్రక్రియ కాదని, కేవలం కేంద్రానికి రాష్ట్ర అభిప్రాయం చేరవేయడమే ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేస్తున్నారు.అసలు చట్టబద్ధ ప్రక్రియ మొత్తం పార్లమెంట్ పరిధిలో జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లో మార్పులు చేయాల్సి ఉండటంతో, కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లు ప్రవేశపెడుతుంది. ఆ బిల్లు రెండు సభల్లో ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పుడే అమరావతి అధికారికంగా శాశ్వత రాజధానిగా గుర్తింపు పొందుతుంది.ఈ నేపథ్యంలో శాసన మండలిలో తీర్మానం ప్రవేశపెట్టకపోవడం పెద్ద సమస్య కాదని కొందరు రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే కేంద్రం కోరింది రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయం మాత్రమేనని, అది తీర్మానం ద్వారా పంపించబడిందని వారు చెబుతున్నారు. ఇక వైసీపీ ఈ అంశంపై విమర్శలు చేయడం వల్ల రాజకీయంగా వారికి నష్టం జరిగే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ చర్చలో పాల్గొనకపోవడం ప్రజల్లో ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చని అంటున్నారు. మొత్తంగా అమరావతి అంశం చుట్టూ రాజకీయంగా వేడి పెరుగుతుండగా, రాబోయే రోజుల్లో కేంద్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి.

# సింగరేణి ఓసీటూ విపిఆర్ ఓబి కంపెనీలో ఘోర ప్రమాదం...

## బీహార్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు కార్మికులలో ఒకరు మృతి

## మరొకరి పరిస్థితి విషమం.. ముగ్గురికి తీవ్ర గాయాలు...

మణుగూరు మార్చి 30
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి ూఅ-2 విపిఆర్ ఓబీ కంపెనీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది ,సాని ట్రక్ (డంపర్ ) ను ఐదుగురు కార్మికులు మరమ్మతులు చేస్తుండగా టైర్ పేలిపోవడంతో ఒక వ్యక్తి మృతి చెందగా ముగ్గురికి తీవ్రయాలు అయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా వుంది. గాయపడిన ప్రైవేట్ కార్మికులను సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు,
వివరాల్లోకెళ్తే : మణుగూరు సింగరేణి ఓసి టు వి పి ఆర్ ఓబీ కంపెనీ లో సాని ట్రక్ ( డంపర్ ) టైరు బేరింగ్ లాక్ కావడంతో, టైర్లు తీసివేస్తుండగా బేరింగ్ రింగు లూస్ కావడంతో ఎయిర్ లాక్ కావడంతో భారీ శబ్దంతో టైర్ బ్లాస్ట్ అయిందని స్థానిక కార్మికులు చెబుతున్నారు... బీహార్ రాష్ట్రానికి చెందిన సర్ఫరాజ్ ( 40 ) టైర్ ఫిట్టర్ అక్కడికక్కడే మృతి చెందగా సాహెబ్ బల్ యాదవ్ (50 ) డ్రైవర్ పరిస్థితి విషం... మంద కుమార్ ( 26 ) మెకానిక్, జగదీష్ కుష్వల్ (50 ) టైర్ సెక్షన్, ఎండి తజన్ సారీ ( 26 ) టైర్ ఫిట్టర్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి.

# నీటిలో మునిగి ఇద్దరు మృతి

అనకాపల్లి మార్చి 30
మునగపాక మండలం ఉమ్మలాడ బ్రిడ్జి సమీపంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. స్నానానికి వెళ్లిన ఇద్దరు యువకులు... ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికులను తీవ్రగ్భ్రాంతికి గురి చేసింది. మృతులు అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ సాయి నగర్ ముత్రాసు కాలనీకి చెందిన చింతా రోహిణి కుమార్, వయస్సు 26 సంవత్సరాలు, మరియు తాడి హర్ష వర్ధన్, వయస్సు 24 సంవత్సరాలు గా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్విమ్మర్ల సహాయంతో మృతదేహాలను వెలికితీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.
======================

# అడవిలో మావోయిస్టులతో కలిసి భోజనం చేసిన ఎస్సై

రాయ్ పూర్ మార్చి 30
ఛత్తీస్గఢ్లోని కాంకేర్ జిల్లాలో ఆదివారం, ముగ్గురు మావోయిస్టులు లొంగిపోవడానికి వస్తున్నారనే సమాచారంతో పార్తాపూర్ ఎస్సై రామేశ్వర్ చతుర్వేది స్వయంగా అడవులకు వెళ్లి వారిని కలిసారు. దండకారణ్యంలో కాలినడకన వస్తున్న మావోయిస్టులకు ఆహారం లేదని తెలుసుకుని, వారికి భోజన ఏర్పాట్లు చేసి, వారితో కలిసి అడవిలో భోజనం చేశారు.

# అమరావతి ఎప్పుడు ప్రారంభం అవుతుందో తెలుసా

విజయవాడ, మార్చి 30,
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవుతాయనే దానిపై సీఎం చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానంపై చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా అమరావతిలో చేపట్టిన నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయనే దానిపై సీఎ చంద్రబాబు వివరాలు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణ పనులను 2025 మే 2వ తేదీన పునఃప్రారంభించినట్లు చంద్రబాబు గుర్తు చేశారు. 2028 ఆగస్ట్ నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి.. ప్రారంభోత్సవానికి మరోసారి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే అమరావతిలోని ట్రంక్ రోడ్లను మే 27, 2027 నాటి పూర్తిచేస్తామని చంద్రబాబు తెలిపారు.అమరావతి లేఅవుట్లను మే 27, 2028 నాటికి, ఏపీ అసెంబ్లీ నిర్మాణాన్ని మే 28, 2028 నాటికల్లా పూర్తిచేస్తామని చంద్రబాబు వివరించారు. అలాగే ఏపీ హైకోర్టు నిర్మాణాన్ని జూన్ 20, 2028 నాటికి.. అమరావతి ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని ఆగస్ట్ 4, 2028 నాటికి పూర్తిచేసి.. ప్రధాని మోదీని ప్రారంభోత్సానికి ఆహ్వానిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతి ప్రజా రాజధాని అని చెప్పిన చంద్రబాబు.. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతోనే చట్టబద్ధత కల్పిస్తున్నట్లు తెలిపారు.తొమ్మిది నెలల కాలంలోనే అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలను పూర్తి చేశామని చంద్రబాబు వివరించారు. అమరావతిలో ప్రస్తుతం 56 వేలకోట్ల రూపాయల విలువైన పనులు జరుగుతున్నాయని.. 2028 నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అమరావతిలో హింసను సృష్టించాలని ప్రయత్నించేవారికి.. అదే చివరి రోజు అవుతుందంటూ చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉంటుందని.. అది అమరావతి మాత్రమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని ఎవరూ టచ్ చేయలేరంటూ చంద్రబాబు స్పష్టం చేశారు

# ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ

ఇచ్చాపురం మార్చి 30,
యాంకర్ :ఆదివాసీ యువకునిపై ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాలం.అశోక్ బాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోని బహిరంగ క్షమాపణలు కోరారు. ఎస్టి కులంలో బెంతోరియా సామాజిక వర్గాన్ని చేరుస్తున్నారని వారిని ఎస్టిలుగా పరిగణించవద్దని ఎస్టి వర్గాలు అశోక్ బాబును కలవడానికి వచ్చినప్పుడు ఎస్టి యువకుడు భగవాన్ తనను ఉద్దేశించి అసెంబ్లీలో మాట్లాడానికి నువ్వెవరు! అని ప్రశ్నించటంతో తాను ఆవేశంలో ఆ వ్యాఖ్యలు అతనిపై చేసానే కానీ ఆ సామజికవర్గాన్ని ఉద్దేశించి కాదని అన్నారు. 26వ తారీఖున జరిగిన మొత్తం సంభాషణ వార్తలు వేస్తే బాగున్నని కానీ కొంతమంది ఆ విజువల్స్ ను ఎడిటింగ్ చేసి తాను తప్పుమాట్లాడినట్లు చూపించటం తగదని ఆవేదన వ్యక్తం చేసారు. ఆ రోజు ఆ యువకుడు తరుపున ఆ సామజికవర్గం తనకు క్షమాపణ చెప్పారని అది ప్రజలకు తెలిసేలా చేసుంటే విషయం తారస్థాయికి చేరేది కాదని అన్నారు. వైసీపీ హయాంలో బెంతోరియా కులానికి చేసింది ఏమి లేకపోయిన తన వ్యాఖ్యలను సామజిక మాధ్యమాల్లో పెట్టి తనను బయపెట్టాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని ఇటువంటి తాటాకు చప్పుల్లకు భయపడేది లేదని హెచ్చరించారు. తన వ్యాఖ్యలు వలన ఎవరి మనోభావాలు దెబ్బతిన్న తాను బహిరంగ క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ములుగు మార్చి 30,
వెంకటాపురం మండలంలో పాలెం గ్రామ శివారులో ద్విచక వాహనాన్ని ఇసుక లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారుఏ. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తులు కంతి అశోక్ మంగ వాయి గ్రామం, చంటి ముకునూరు పాలెం గ్రామానికి చెందినవారు.

# రాజేంద్రనగర్ లో ఆటో డ్రైవర్స్ పై దాడి.

రాజేంద్రనగర్ మార్చి 30,
శివరాంపల్లీ వద్ద జిల్లాలకు సంబంధించిన ఆటోస్ నడపొద్దు అంటూ డ్రైవర్ల పైదాడి జరిగింది. హైదరాబాద్ ఆటో డ్రైవర్స్ అర్ధరాత్రి ధర్నాకు దిగారు. హైదరాబాద్ నగరంలో జిల్లాలకు సంబంధించిన ఆటోస్ తిరుగుతున్నాయంటూ ఆందోళన చేసారు. జిల్లాలకు సంబంధించిన ఆటోస్ ను అడ్డగించి...... అద్దాలు పగలగొట్టి డ్రైవర్ పై హైదరాబాద్ యూనియన్ నాయకులు దాడి చేసారు.బాధితులు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. యూనియన్ నాయకుల దాడి లో ఐదు మంది తీవ్రంగా గాయపడ్డారు. దాడి చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలంటూ ఐదు మంది ఆటో డ్రైవర్లు పోలీసులకు ఫిర్యాదు చేసారు.
============================

# కేరళ రాజకీయాల్లో స్పష్టమైన మార్పు

తిరువనంతపురం మార్చి 30,
కేరళ రాజకీయాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాలక్కాడ్లో జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. పార్టీ కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కష్టపడుతున్నారని ప్రశంసించారు. ఈ కృషి వల్ల రాష్ట్రంలో రాజకీయ మార్పు స్పష్టంగా తెలుస్తుందని చెప్పారు. భవిష్యత్తులో బీజేపీ కేరళలో మరింత బలపడుతుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న కొడాలి నాని, పన్నీరు సెల్వం

తిరుమల మార్చి 30,
తిరుమల శ్రీవారిని మాజీ మంత్రి కొడాలి నాని,తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీరు సెల్వం వేరువేరుగా దర్శించుకుని ముక్కులు చెల్లించుకున్నారు. దర్శనమనంతరం ప్రముఖులకు రంగనాయక మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు తీర్థప్రదాయాలను అందజేశారు

# ఇండియన్ గ్యాస్ గూడెం వద్ద వినియోగదారులు ఆందోళన

వైరా మార్చి 30
వైరా మున్సిపాలిటీలో ఇండియన్ గ్యాస్ శ్రీ కాణిపాక ఏజెన్సీ గోడ ముందు గ్యాస్ వినియోగదారులు ఆందోళన చేశారు. అనంతరం కాలేజీ సిలిండర్లతో వైరా టు జగ్గయ్యపేట జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులు సిలిండర్ల కోసం భారీగా వచ్చారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ల కొరత ఉందని చెప్పారు.ఇంకా ఎన్ని రోజులు కొరత ఉంటుందని నిర్వాహకులను నిలదీశారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో వినియోగదారులు ఖాళీ సిలిండర్లతో నడిరోడ్డుపై బైఠాయించి ఆందోళనలకు దిగారు.సుమారు అరగంట పైన రోడ్డుపై ఆందోళన చేయడంతో. మధిర, జగ్గయ్యపేట,బోనకల్లు ప్రధాన రహదారి కావడంతో భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక ట్రైనీ ఎస్ఐ పవన్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని, వినియోగదారులకు నచ్చజెప్పి, రోడ్డుకు అడ్డంగా ఉంచిన సిలిండర్లను తొలగించి, ట్రాక్ క్లియర్ చేశారు..

# అహోబిలంలో అన్యమత ప్రచారం

నంద్యాల మార్చి 30
నంద్యాల జిల్లా లోని ఆళ్లగడ్డ మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో ఆదివారం అన్యమత ప్రచారం కలకలం రేపింది.. శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయానికి అత్యంత సమీపంలో అన్యమతస్తులు షెడ్లు వేసి ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు..దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వాళ్ళని అడ్డుకున్నారు..అక్కడినుంచి అన్యమతస్తులను బయటికి పంపించారు.. గత కొన్ని నెలలుగా నుండి ఇలాగే కొనసాగుతూనే ఉందని, పవిత్ర ఆలయ సమీపంలో అన్యమత ప్రచారం చేయకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ చెడుగుడు

హైదరాబాద్, మార్చి 30,
తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయింది. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్ మంత్రులతో కలిసే నిర్ణయాలు తీసుకుటున్నారు. ఢిల్లీకి వెళ్లినా ఒకరిద్దరు మంత్రలును తీసుకెళ్లడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. విదేశీ పర్యటనలకు కూడా మంత్రులు వెళ్తున్నారు. అయితే రెండున్నరేళ్లయినా సీఎం సత్తాను మంత్రులు సరిగా గుర్తించలేదు. కానీ తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి తాజాగా తన రాజకీయ పటుత్వాన్ని, వాదనా చాతుర్యాన్ని ప్రదర్శించడంతోపాటు, ప్రతిపక్ష నేత హరీశ్ రావుపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించి గులాబీ శిబిరానికి ఊహించని షాకిచ్చారు. ఈ ఘటన తర్వాత కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ మంత్రులకు కూడా తమకు, సీఎంకు మధ్యనున్న నాయకత్వ అంతరాన్ని, రేవంత్ 'విలువ'ను స్పష్టంగా అర్థం చేసుకునే పరిస్థితి ఏర్పడిందిఇతర పార్టీల మాదిరిగా కాకుండా, కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన రాజకీయ సంస్కృతి కనిపిస్తూ ఉంటుంది. పార్టీలో సీనియర్ నేతలు ఎవరూ కూడా తమకంటే వయసులోనూ, అనుభవంలోనూ చిన్నవారైన రేవంత్ అధికృతను సులభంగా అంగీకరించలేకపోయారు. ఎన్నికల సమయంలో పది మంది ఎమ్మెల్యేల్ని గెలిపించుకోవడానికి ముందుకు రాని నేతలు, అధికారం వచ్చిన తర్వాత మాత్రం మంత్రి పదవుల కోసం పోటీపడ్డారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ చేతికే అధికార దండాన్ని అప్పజెప్పింది. ఇది ఆయన సామర్థ్యానికి నిదర్శనం. అసెంబ్లీ సమావేశాలు సీఎం సత్తాను మరోసారి నిరూపించాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై హరీశ్ రావు విరుచుకుపడిన సమయంలో, ఇతర మంత్రుల దగ్గర సరైన సమాధానాలు లేకపోయాయి. ఈ తరుణంలో రంగంలోకి దిగిన రేవంత్, హరీశ్ వాదనను పూర్తిగా ఖండించారు. కేవలం వాదనతోనే కాకుండా, సీబీసీఐడీ విచారణకు ఆదేశించడం ద్వారా ప్రతిపక్షాన్ని నిలువరించారు. ఇది ఆయన నిర్ణయ తీసుకునే సామర్థ్యాన్ని చాటిచెప్పింది. ఈ ఘటన తర్వాత, తాము కేవలం పాలనలో భాగస్వాములమే కానీ, నిజమైన నాయకుడు సీఎం మాత్రమేనని మంత్రులకు అర్థమైంది.రేవంత్ నాయకత్వ సామర్థ్యానికి ఇది కేవలం రాష్ట్రస్థాయి గుర్తింపు మాత్రమే కాదు జాతీయస్థాయి గుర్తింపు వచ్చింది. 2025లో దేశంలోనే అత్యంత శక్తిమంతులైన 100 మంది జాబితాలో రేవంత్ రెడ్డికి 28వ స్థానం దక్కింది. గత ఏడాదితో పోలిస్తే 11 స్థానాలు మెరుగుపరచుకున్నారు.



జాతీయ స్థాయిలో ఇండి కూటమిలో ఆయన పోషిస్తున్న కీలక పాత్ర, తెలంగాణలో తీసుకువచ్చిన సంస్కరణలే ఈ గుర్తింపుకు కారణం.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులు, మితిమీరిన ఆత్మవిశ్వాసం కాంగ్రెస్ విజయానికి కారణమయ్యాయని అంటారు. కానీ, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, అధికారాన్ని నిలబెట్టుకునే విషయంలో రేవంత్ కీలక పాత్ర పోషించారు. అసెంబ్లీ సాక్షిగా ఆయన ప్రదర్శించిన పటుత్వం, సీనియర్ మంత్రులకు తమ 'విలువ'కు, సీఎం 'విలువ'కు మధ్యనున్న తేడాను స్పష్టంగా చూపించింది.

# సిటీ రోడ్స్‌కు ఫుల్ నిధులు

హైదరాబాద్, మార్చి 30,
హైదరాబాద్ నగరంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతి జోన్‌కు రూ.25 కోట్ల చొప్పున మొత్తం రూ.150 కోట్లు కేటాయించారు. కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం కింద రూ.3,145 కోట్లతో 1,045 కి.మీ ప్రధాన రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే నగరవాసులకు గుంతల నుంచి విముక్తి లభించి, ప్రయాణం సాఫీగా సాగనుంది.హైదరాబాద్ మహానగరంలో వాహనదారుల ఇబ్బందులు తొలగనున్నాయి. ఇక నుంచి ప్రయాణం సాఫీగా సాగనుంది. నగర ప్రజల ప్రయాణాన్ని సుఖమయం చేసేందుకు మూడు నగరపాలక సంస్థలు నడుం బిగించాయి. జీహెచ్ఎంసీ , సైబరాబాద్ నగరపాలక సంస్థ, మల్కాజిగిరి నగరపాలక సంస్థ సంయుక్తంగా రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేశాయి. ఇప్పటికే సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్లు జోన్ల వారీగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించగా.. తాజాగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నగరంలోని ఆరు జోన్లకు కలిపి రూ.150 కోట్ల ప్రత్యేక నిధులను కేటాయించారు. ప్రతి జోన్‌కు రూ.25 కోట్ల చొప్పున కేటాయించిన ఈ బడ్జెట్‌తో అత్యవసర రోడ్ల మరమ్మతులు చేపట్టనున్నారు. మార్చి 31వ తేదీలోపు రహదారుల అంచనాలు రూపొందించి.. ఉన్నతాధికారుల ఆమోదం పొందాలని జోనల్ కమిషనర్లకు కమిషనర్ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం పాత జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్లలో కార్పొరేటర్లకు కేటాయించిన కోటి రూపాయల నిధులలో మెజారిటీ వాటా సీసీ రోడ్ల నిర్మాణానికే ఖర్చవుతోంది. దీనివల్ల ప్రధాన అంతర్గత రహదారుల నిర్వహణ కుంటుపడుతోందన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే కమిషనర్ కేటాయించిన రూ.150 కోట్ల నిధులు అత్యంత కీలకంగా మారాయి. ఇప్పటికే చార్మినార్, సికింద్రాబాద్ జోన్ల అధికారులు స్పందించి పనులకు ఆమోదం పొందుతున్నారు. మరోవైపు సీఎంసీకి రూ.500 కోట్లు, ఎంఎంసీకి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించగా.. అందులో సీఎంసీ రూ.300 కోట్లు, ఎంఎంసీ రూ.250 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్ పొందాయినగర విస్తరణతో రహదారుల సవాళ్లు కూడా పెరిగాయి. గతంలో 9 వేల కిలోమీటర్లుగా ఉన్న రోడ్ల పొడవు, శివారులోని 27 స్థానిక సంస్థల విలీనంతో ఏకంగా 14,787.66 కిలోమీటర్లకు చేరింది. ఈ శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడం ఇప్పుడు ఇంజినీరింగ్ విభాగం ముందున్న ప్రధాన లక్ష్యం. దీనికి తోడు 'కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం'కింద 1045.01 కిలోమీటర్ల ప్రధాన రహదారులను రూ.3,145 కోట్ల భారీ వ్యయంతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భారీ అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. నగరవాసులు ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కడమే కాకుండా, ప్రమాద రహితంగా సాఫీగా ప్రయాణించే వీలుంటుంది. దాంతో పాటు ఆయా కాలనీలు రహదారుల పరంగా అభివృద్ధి చెందనున్నాయి. త్వరలోనే ఈ రోడ్ల నిర్మాణ పనులు పట్టాలెక్కనుండగా.. ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని అధికారులు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

# కొత్త నియోజకవర్గాలు... కలిసొచ్చేదెవరికి

కరీంనగర్, మార్చి 30
కేంద్రం ఇటీవల నియోజకవర్గాల పునర్విభజనకు అనుమతి ఇచ్చింది. జనాభా ఆధారంగా పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు రావడంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల్లో 50 శాతం పెంచాలని ప్రతిపాదించింది. దీంతో తెలంగాణలో ప్రస్తుతం 119 స్థానాలు ఉండగా కొత్తగా 60 అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. ఉమ్మడి జిల్లాల వారీగా 5 స్థానాలు పెరగబోతున్నాయి. దీంతో కరీంనగర్ జిల్లా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే సరిహద్దులు మారిపోవడం ఖాయం. దశాబ్దాలుగా ఒకే నియోజకవర్గంలో పట్టు సాధించిన నాయకులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు కొత్త నియోజకవర్గాలు ఏర్పడితే తమ సామాజిక సమీకరణాలు కలిసొస్తాయని, తమ రాజకీయ కల నెరవేరుతుందని ద్వితీయ శ్రేణి నేతలు ఆశపడుతున్నారు. ఈ చదరంగంలో ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అనేది ఆసక్తికర అంశంగా మారిందఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రస్తుతం 13 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు, ఒక పార్లమెంటు స్థానాన్ని కలిగి ఉంది. ఈ నియోజకవర్గాల్లో కొన్ని దశాబ్దాలుగా ఒకే పార్టీ లేదా ఒకే కుటుంబం ఆధీనంలో ఉన్నాయి. సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి పనుల ఆధారంగా ఓటర్లు నిర్ణయం తీసుకుంటున్నారు. కానీ నియోజకవర్గాల పెంపు జరిగితే ఈ సమీకరణాలన్నీ మారిపోయే అవకాశం ఉంది.నియోజకవర్గాల పునర్విభజనతో దశాబ్దాలుగా ఒకే నియోజకవర్గంలో పట్టు సాధించిన సీనియర్ నేతలకు నియోజకవర్గాల పునర్విభజన పెద్ద తలనొప్పిగా మారింది. పట్టు ఉన్న ప్రాంతాలు వేరు నియోజకవర్గాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. వారికి మద్దతుగా ఉన్న ఓటు బ్యాంకు రెండు లేదా మూడు నియోజకవర్గాలుగా విభజించబడే అవకాశం ఉంది. కొత్త నియోజకవర్గాల్లో కొత్త నేతలు పోటీకి దిగే అవకాశం ఉంది.నియోజకవర్గాల పెంపు ద్వితీయ శ్రేణి నేతలకు, యువ నేతలకు పెద్ద అవకాశంగా మారింది. కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుంది. తమ సామాజికవర్గం ఆధిక్యం ఉన్న ప్రాంతాలు కొత్త నియోజకవర్గంగా ఏర్పడితే, గెలుపు అవకాశాలు పెరుగుతాయి. పార్టీలు కూడా కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాయి.రాజకీయ పార్టీలకు నియోజకవర్గాల పెంపు వ్యూహాత్మక అవకాశంగా మారింది. తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను కలిపి, కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. విభజన వల్ల అధికార పార్టీ ఓటు బ్యాంకు చీలి, తమకు లాభం చేకూరుతుందని ఆశిస్తుంది. కొత్త నియోజకవర్గాల్లో తమ ప్రాబల్యం చూపించే అవకాశం లభిస్తుంది.కరీంనగర్ జిల్లాలో వివిధ సామాజిక వర్గాలు(రెడ్డి, వెలమ, బ్రాహ్మణ, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ) ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఈ సమీకరణాలు మారిపోతాయి. కొత్త నియోజకవర్గాల్లో ఒకే సామాజిక వర్గం ఆధిక్యం ఏర్పడితే, ఆ వర్గం నేతకు అవకాశం లభిస్తుంది. వివిధ వర్గాలు సమానంగా ఉన్న నియోజకవర్గాల్లో పోటీ మరింత తీవ్రంగా మారుతుంది. ఒకే సామాజిక వర్గం ఆధిక్యం లేనప్పుడు, వివిధ వర్గాల కూటమి అభ్యర్థి గెలుపు నిర్ణయిస్తుంది.నియోజకవర్గాల పెంపు ఖాయమైతే, పార్టీల లోపల టికెట్ ఆకాంక్షలు పెరుగుతాయి. సీనియర్ నేతలు, యువ నేతల మధ్య ఘర్షణ తప్పదు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారే అవకాశం ఉంది. ఒకే పార్టీ గెలవడం కష్టమైన నియోజకవర్గాల్లో, కూటమి రాజకీయాలు ముఖ్యమవుతాయి. వివిధ సామాజిక వర్గాల నేతలతో కూటమి ఏర్పాటు చేసుకుని, గెలుపును సాధించే ప్రయత్నం జరుగుతుంది. కొత్త నియోజకవర్గాల్లో ప్రచార వ్యూహాలు మారాల్సి ఉంటుంది. సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారం మరింత ముఖ్యమవుతుంది. స్థానిక సమస్యలపై దృష్టి పెట్టాల్సి ఉంటుందినియోజకవర్గాల పెంపు కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో పెద్ద మార్పును తీసుకురాబోతోంది. దశాబ్దాలుగా పట్టు సాధించిన సీనియర్ నేతలకు ఇది సవాలుగా మారితే, యువ నేతలకు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలకు ఇది సువర్ణావకాశంగా మారింది.

## మోకిలా లో భారీగా డ్రగ్స్ పట్టివేత

రంగారెడ్డి మార్చి 30,
మోకిలా లో 40 గ్రాముల కొకైన్ ను ఫ్యూచర్ సిటీ పోలీసులు పట్టుకున్నారు. డ్రగ్స్ విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిందితుడు రైల్వే శాఖ లో సూపరింటెండెంట్ గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. బెంగళూరు , గోవా నుండి డ్రగ్స్ హైదరాబాద్ కు స్మగ్లింగ్ చేస్తున్నాడు. కారులో డ్రగ్స్ తెచ్చి హైదరాబాదులో విక్రయిస్తున్నాడు. అతని వద్ద 40 గ్రాముల కొకైన్ సీజ్. చేసారు. ఘటనలో గూగుల్ లో పనిచేస్తున్న సాఫ్ట్ వేర్ ఇంజనీర్ తో పాటు మరో వ్యాపారవేత్త అరెస్ట్ అయ్యారు. వారి వద్ద నుండి రెండు కార్లు సీజ్ చేసారు.

==========================

## చిలకలూరు లో ఓఎన్జీసీ అన్వేషణ అందోళనలో రైతులు

నంద్యాల మార్చి 30,
రుద్రవరం మండలం చిలకలూరులో ఆయిల్, గ్యాస్ సర్వే కలకలం రేపింది. ఓఎన్జీసీ సిబ్బంది చమురు గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషిస్తున్నారు. అభివృద్ధి కోణంలో ఇది మంచి పరిణామమే అయినా రైతులకు మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా ఓ ఎన్ జి సి లేదా ఇతర చమురు సంస్థలు సిస్మిక్ సర్వే నిర్వహిస్తాయి. భూమి లోపలి పొరల్లో చమురు లేదా గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి చిన్నపాటి రంధ్రాలు వేసి పరీక్షలు చేస్తారు. ఈ ప్రాథమిక సర్వేలో సేకరించిన వాటిని విశ్లేషణ కోసం ఢిల్లీ లేదా ఇతర ప్రధాన కార్యాలయాలకు పంపిస్తారు. అక్కడ నివేదిక సానుకూలంగా వస్తేనే తదుపరి తవ్వకాలు చేపడతారు. సర్వే సమయంలో పంటలకు నష్టం జరిగితే ఆ సంస్థలో రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించాలి. నిక్షేపాలు ఉన్నాయని నిర్ధారణ అయ్యి భూమిని సేకరించాల్సి వస్తే ప్రభుత్వం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేసి, భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం అందిస్తుంది.

==========================

## అహోబిలంలో అన్యమత ప్రచారం

నంద్యాల మార్చి 30,
నంద్యాల జిల్లా లోని ఆళ్లగడ్డ మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో ఆదివారం అన్యమత ప్రచారం కలకలం రేపింది.. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి అత్యంత సమీపంలో అన్యమతస్తులు షెడ్లు వేసి ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు..దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వాళ్ళని అడ్డుకున్నారు..అక్కడినుంచి అన్యమతస్తులను బయటికి పంపించారు.. గత కొన్ని నెలలుగా నుండి ఇలాగే కొనసాగుతూనే ఉందని, పవిత్ర ఆలయ సమీపంలో అన్యమత ప్రచారం చేయకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు

## ఇండియన్ గ్యాస్ గూడెం వద్ద వినియోగదారులు ఆందోళన

వైరా మార్చి 30,
వైరా మున్సిపాలిటీలో ఇండియన్ గ్యాస్ శ్రీ కాణిపాక ఏజెన్సీ గోడ ముందు గ్యాస్ వినియోగదారులు ఆందోళన చేశారు. అనంతరం కాలేజీ సిలిండర్లతో వైరా టు జగ్గయ్యపేట జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులు సిలిండర్ల కోసం భారీగా వచ్చారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ల కొరత ఉందని చెప్పారు.ఇంకా ఎన్ని రోజులు కొరత ఉంటుందని నిర్వాహకులను నిలదీశారు.
పొంతన లేని సమాధానం చెప్పడంతో వినియోగదారులు ఖాళీ సిలిండర్లతో నడిరోడ్డుపై బైఠాయించి ఆందోళనలకు దిగారు.సుమారు అరగంట పైన రోడ్డుపై ఆందోళన చేయడంతో. మధిర, జగ్గయ్యపేట,బోనకల్లు ప్రధాన రహదారి కావడంతో భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
విషయం తెలుసుకున్న స్థానిక ట్రైనీ ఎస్ఐ పవన్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని, వినియోగదారులకు నచ్చజెప్పి, రోడ్డుకు అడ్డంగా ఉంచిన సిలిండర్లను తొలగించి, ట్రాక్ క్లియర్ చేశారు..

# మూతపడ్డ వైన్ షాప్

భద్రాద్రి మార్చి 30
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణలో భారీ నిర్లక్ష్యం బయటపడింది. డీలర్ అనధికారికంగా షాప్ మూసివేసినా ఆబ్కారీ శాఖ మాత్రం చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. దమ్మపేట మండలకేంద్రంలో ఓ వైన్ షాప్ అనధికారికంగా మూతపడింది. గత ఏడాది జరిగిన లిక్కర్ దుకాణాల లాటరీలో మూడవ నంబర్ షాపు దక్కించుకున్న వ్యక్తి లైసెన్సు ఫీజు చెల్లించి విజయదుర్గ వైన్స్ పేరుతో దుకాణాన్ని ప్రారంభించాడు.
ఈ నెల 5వ తేదీ నుండి దుకాణాన్ని అనధికారికంగా మూసివేశారు. 25 రోజులుగా దుకాణం మూసివేసినా సంబంధిత శాఖ దృష్టి పెట్టలేదు. ఇన్ని రోజులు షాపులో కొనుగోళ్లు అమ్మకాలు జరగనప్పటికీ ఇా, ంఇా, ఆఅ లు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.
ఓ మద్యం దుకాణం అనధికారికంగా మూసివేస్తే సగటున రోజుకి పదివేల వరకూ జరిమానా ఉండగా 25 రోజులనుండి మూసివేసినా సదరు దుకాణం పై చర్యలు తీసుకోవడంలో ఆబ్కారీ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూసివేసిన దుకాణం వ్యవహారంలో ఆప్కారి జిల్లా అధికారుల పాత్ర ఏమైనా ఉందా అన్న అనుమానాలు సైతం లేకపోలేదు. ఆబ్కారీ అధికారులు దుకాణాల నిర్వహణపై దృష్టి పెట్టకుంటే నకిలీ మద్యం మాత్రం ఎలా పట్టుకుంటారనే ప్రశ్నలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

# తిరుమల భూములను చౌకగా అప్పగిస్తున్నారు

తిరుపతి మార్చి 30,
పవిత్ర పుణ్యక్షేత్రం చెంత వేల కోట్ల విలువైన భూములను కారుచౌకగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారంటూ మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపణలు చేశారు. దాదాపు వెయ్యి కోట్ల రూపాయల విలువ చేసే 22 ఎకరాల భూమిని, కేవలం 94 కోట్లకే ధారాదత్తం చేయడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన మండిపడ్డారు.
బెంగళూరుకు చెందిన దివ్యశ్రీ, హైదరాబాద్కు చెందిన సైబర్ సిటీ డెవలపర్స్ సంస్థలు లోకేష్కు బినామీలా అని భూమన ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా పీపీపీ పద్ధతిలో ఇవ్వాల్సిన టూరిజం స్థలాలను, ఏకంగా ఫ్రీ హోల్డ్ కింద రియల్ ఎస్టేట్ సంస్థలకు ఇవ్వడం వెనుక మతలబు ఏంటని నిలదీశారు. తిరుచానూరు అమ్మవారి ఆలయ సమీపంలో వెల్నెస్ సెంటర్లు, ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణం స్థానిక ఆధ్యాత్మికతను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రస్తుత టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు తన పదవిని వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారని, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల కోసం దర్శనాలను ఎరగా వేస్తున్నారని భూమన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ భూ కేటాయింపులను రద్దు చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

==============================

# అదిలాబాద్, నాగార్జనసాగర్‌లలో ఎయిర్ పోర్టు

హైదరాబాద్, మార్చి 30,

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉడాన్ 2.0' పథకం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో విమానయాన సౌకర్యాలు భారీగా మెరుగుపడనున్నాయి.తెలంగాణలోని ఆదిలాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్‌లలో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఉడాన్ 2.0 కింద కేటాయించిన రూ.28,000 కోట్లతో దేశవ్యాప్తంగా 100 ఎయిర్‌పోర్టులు, 200 హెలిపోర్టులను అభివృద్ధి చేయనున్నారు.తెలంగాణ, ఏపీ ప్రజలకు కేంద్రం తీపి కబురు చెప్పింది. రెండు రాష్ట్రాల్లో కొత్తగా ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన 'ఉడాన్ 2.0' పథకం రెండు తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త జవజీవాలను అందించబోతోంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా లభించబోయే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా ఇప్పటికే ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లను పూర్తిస్థాయి విమానాశ్రయాలుగా మార్చడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల తెలంగాణలోని ఆదిలాబాద్, ఏపీలోని పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ వంటి ప్రాంతాలకు విమాన కనెక్టివిటీ




లభించనుంది.ఆదిలాబాద్‌లో ప్రస్తుతం రక్షణ శాఖ అధీనంలో ఉన్న ఎయిర్‌ఫోర్స్ ఎయిర్‌స్ట్రిప్‌ను తాము స్వాధీనం చేసుకోబోమని, దానికి ఆనుకుని ఉన్న అదనపు భూమిని సేకరించి పౌర విమానయాన విమానాశ్రయాన్ని నిర్మిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అలాగే.. హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే కింద ట్రాఫిక్ టన్నెల్ నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు భరిస్తే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఉడాన్ 2.0 కింద కేటాయించిన రూ.28,000 కోట్లలో రూ.12,000 కోట్లు విమానాశ్రయాల అభివృద్ధికి, రూ.3,500 కోట్లు 200 హెలిపోర్టుల నిర్మాణానికి కేటాయించారు. విమానయాన సంస్థల నష్టాలను భర్తీ చేసే 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కోసం మరో రూ.10,000 కోట్లు వెచ్చించనున్నారు.తెలంగాణలో వరంగల్ మామునూరు ఎయిర్-పోర్టు ఫైలు ప్రస్తుతం వివిధ శాఖల సంప్రదింపుల దశలో ఉందని, జూన్‌లో దీనికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. కొత్తగూడెం, బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టులకు సంబంధించి సరైన భూమిని చూపిస్తే వెంటనే చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విజయవాడ గన్నవరం విమానాశ్రయ విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని, వచ్చే ఏడాది జూన్ కల్లా ఇవి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.మరోవైపు, భారత విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పుగా 'ఎంబ్రాయిర్' సంస్థ దేశీయంగా విమానాల తయారీపై ఆసక్తి చూపుతోందని మంత్రి తెలిపారు. 2028 చివరి నాటికి భారత్‌లో తయారైన తొలి విమానాన్ని తీసుకురావాలన్న లక్ష్యంతో ఆ సంస్థ కసరత్తు చేస్తోందని, ఇది 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా పెద్ద విజయమని ఆయన కొనియాడారు. ఈ అభివృద్ధి పనులన్నీ పూర్తయితే, తెలుగు రాష్ట్రాల మధ్య, దేశంలోని ఇతర ప్రధాన నగరాల మధ్య ప్రయాణ దూరం భారీగా తగ్గడమే కాకుండా ఆర్థిక ప్రగతికి బాటలు పడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దవాఖానాల్లో సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు..

హైదరాబాద్, మార్చి 30,

ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రవాస తెలుగు వైద్య నిపుణుల సేవలను ప్రవేశపెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. విదేశీ వైద్యులను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను వైద్య ఆరోగ్య శాఖ రూపొందిస్తోంది. దీని ద్వారా విదేశాల నుండి వచ్చే నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి వీలు కలుగుతుంది. రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖను పటిష్ఠం చేయటమే కాకుండా.. పేదలకు అంతర్జాతీయ స్థాయి చికిత్సను అందుబాటులోకి తీసుకొస్తుంది.పేదరోగులకు నిజంగా ఇది తీపి కబురే. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందనుంది. వైద్యారోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ.. విదేశాల్లో స్థిరపడిన ప్రవాస తెలుగు వైద్య నిపుణుల సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలోని పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రులలో త్వరలో విదేశీ వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రవాస భారతీయులైన నిపుణుల నైపుణ్యాన్ని ఇక్కడి పేద రోగులకు ఉచితంగా అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ వేగంగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తూ.. విదేశీ వైద్యులను సమన్వయం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది.చాలామంది విదేశీ డాక్టర్లకు తమ మాతృభూమికి సేవ చేయాలనే తపన ఉన్నప్పటికీ, సరైన వేదిక లేక వెనుకంజ వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఒక కేంద్రీకృత వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తోంది. ఈ పోర్టల్ ద్వారా వైద్యులు తమ స్పెషలైజేషన్, వారు హైదరాబాద్‌లో అందుబాటులో ఉండే రోజులు, కేటాయించగలిగే సమయాన్ని నమోదు చేసుకోవచ్చు. వ్యక్తిగత కారణాలతో లేదా వైద్య సదస్సుల కోసం హైదరాబాద్ వచ్చే నిపుణులు, తమ విరామ సమయంలో కొన్ని రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించడం లేదా వైద్య విద్యార్థులకు 'గెస్ట్ ఫ్యాకల్టీ'గా బోధించడం వంటి సేవలు అందించవచ్చు.హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలకు కేంద్రంగా మారింది. విదేశాలతో పోలిస్తే ఇక్కడ



వైద్య ఖర్చులు తక్కువగా ఉండటం, అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉండటంతో విదేశీ రోగులు కూడా హైదరాబాద్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా అంతర్జాతీయ నిపుణులు సేవలు అందించడం ద్వారా, ప్రభుత్వ రంగంలో వైద్య ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. గతంలో విదేశాల్లో పనిచేసిన అనేక మంది నిపుణులు ప్రస్తుతం ఇక్కడి కార్పొరేట్ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నారు.

వారి అనుభవాన్ని ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొనసాగించటం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా దక్కుతుంది. ఈ మేరకు రేవంత్ సర్కార్ ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తుంది.

ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే పేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం రూపాయి ఖర్చు లేకుండా అందుతుంది.ఇక హైదరాబాద్ నగరంలో కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. ఎల్బీనగర్‌కు మెడికల్ కాలేజీ కేటాయిస్తూ మంత్రి దామోదర రాజనర్సింహ్మ కీలక ప్రకటన చేశారు. ఇప్పటి వరకు మహేశ్వరం పేరుతో మెడికల్ కాలేజీగా ఉండగా.. ఇక నుంచి ఎల్బీనగర్‌కు కేటాయిస్తున్నట్లు చెప్పారు.

# గోల్డ్ మ్యాన్ కాదు...
# రోల్డ్ గోల్డ్ మ్యాన్...

హైదరాబాద్, మార్చి 30,

తెలంగాణ గోల్డ్ మ్యాన్.. ఫేక్ అని ఐటీ అధికారులు తేల్చారు. ఒంటిపై కిలోల కొద్ది బంగారు ఆభరణాలను వేసుకుని తిరుగుతున్న బంగారు బాబు.. నకిలీ బంగారు బాబు అని తేల్చారు. ఇటీవల ఢిల్లీలో అతడి బంగారాన్ని సీజ్ చేసుకున్న ఐటీ అధికారులు.. అది నిజమైన బంగారం కాదని గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఇన్ని రోజులు బంగారు ఆభరణాలతో తిరిగిన ఆ గోల్డ్ బాబు కాస్తా రోల్డ్ గోల్డ్ బాబు కావడం ఇప్పుడు పెను సంచలనంగా మారిందఇటీవల ఐటీ అధికారులకు చిక్కిన తెలంగాణ గోల్డ్ మ్యాన్ కొండ విజయ్ కుమార్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం రేపుతోంది. విజయ్ కుమార్ ధరించింది అంతా నిజమైన బంగారం కాదని.. నకిలీ గోల్డ్‌తో అతడు అందర్నీ మాయ చేస్తున్నాడని ఐటీ అధికారులు గుర్తించారు. విజయ్ కుమార్ సోషల్ మీడియా పోస్ట్‌లు, యూట్యూబ్ ఇంటర్వ్యూలను పరిగణలోకి తీసుకుని రంగంలోకి దిగిన ఐటీ అధికారులకు అంతా నకిలీ అని తేల్చారు. దీంతో ఆ గోల్డ్ మ్యాన్ వ్యవహారం అందరికీ తెలిసింది.హైదరాబాద్‌లో భారీ బంగారు ఆభరణాలు ధరించి.. మీడియా, సోషల్ మీడియా, నిజ జీవితంలో పెను సంచలనం రేపిన గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్ అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన పల్లపు సురేష్ కుమార్ అలియాస్ సూర్య భాయ్.. ధరించేది నిజమైన బంగారం కాదని.. అది అంతా నకిలీ అని ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు తేల్చారు. ఇటీవల అతడిని అడ్డుకున్న ఐటీ అధికారులు.. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అతడి ఒంటిపై ధరించిన నగలను సీజ్ చేసి విచారణ చేపట్టగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది.తెలంగాణ హాకీ సంఘం అధ్యక్షుడిగా ఉన్న కొండ విజయ్‌కుమార్‌ను ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అడ్డుకున్న ఐటీ అధికారులు 12 గంటల సుదీర్ఘ విచారణ తర్వాత అతడు ధరించిన 1.4 కిలోల బంగారాన్ని సీజ్ చేసి విచారణ చేపట్టారు.

ఆయన ఆర్థిక మూలాలకు సంబంధించిన వివరాలను ఐటీ అధికారులు ఆరా తీశారు. ఆ నగలను విచారణ చేసిన అధికారులు పరీక్షించగా అవి ఫేక్ అని తెలిసి ఆశ్చర్యానికి గురయ్యారు.గోల్డ్ మ్యాన్ విజయ్ కుమార్ వద్ద ఉన్న సుమారు 32 రకాల భారీ బరువైన ఆభరణాల్లో ఎక్కువ భాగం రాగితో చేసి రోడియం పూత పూసినవేనని తేల్చారు. తన వద్ద ఉన్న ఆభరణాల విలువ సుమారు రూ.1 కోటి ఉంటుందని అతను చెప్పినా.. మార్కెట్ ధర ప్రకారం అది కేవలం రూ. 3 లక్షలే అని ఐటీ అధికారులు నిర్ధారించారు. ఆ నగలు తొందరగా రంగు వెలిసిపోవడంతోపాటు.. అవి కొత్త ఆభరణాలు అన్నట్లుగా ప్రజలను నమ్మించేవాడని ఐటీ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది.ఇక బంగారు బాబు విజయ్ కుమార్.. లైఫ్ స్టైల్ చూస్తే కోటీశ్వరుడిలా అనిపించినా.. అతని ఆర్థిక పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని ఈ సంఘటన ద్వారా వెల్లడైంది. 2022-23లోనే కేవలం రూ. 4.9 లక్షల ఆదాయాన్ని మాత్రమే అతడు చూపించాడని తేల్చారు. గత 6 ఏళ్లుగా అతడు ఐటీ రిటర్నులే దాఖలు చేయలేదని ఐటీ అధికారులు తెలిపారు. అతడి పేరు మీద గానీ.. భార్య పేరు మీద గానీ ఎలాంటి స్థిరాస్తులు లేవని గుర్తించారు. నెలకు రూ.20 వేల అద్దె ఇంట్లోనే అతడు నివసిస్తున్నాడని వెల్లడించారు. భూ వివాదాల్లో వచ్చే కమిషన్లతోనే అతడి వద్ద ఉన్న మహీంద్రా థార్.. ఎండీవర్ వంటి లగ్జరీ కార్లను కొనుగోలు చేసినట్లు తేల్చారు.

# భూబాధితులకు అండగా బీఆర్ఎస్ : కేటీఆర్

హైదరాబాద్ మార్చి 30,

వట్టినాగులపల్లి భూ ఆక్రమణలపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల మీడియా సమావేశం నిర్వహించారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుమారుడు పొంగులేటి హర్షా రెడ్డి వట్టినాగులపల్లిలో చేస్తున్న భూ కబ్జాలపై, భూ నిర్వాసితులకు అండగా నిలిచిన భారత రాష్ట్ర సమితి (ఃఖీూ) ఎమ్మెల్యేల బృందం బాధితులు సతీష్ షా కుటుంబంతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించింది.

కేటీఆర్ మాట్లాడుతూ 1960 నుంచే ఇక్కడ సతీష్ షా కుటుంబానికి భూమి ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా వారి పేరుమీదనే భూమి ఉంది. గత 60 సంవత్సరాలుగా ఈ భూమిలో వారు నివసిస్తున్నారు. వట్టినాగులపల్లి గ్రామం అభివృద్ధి చెందిన తర్వాత ఇక్కడ భూముల విలువలు భారీగా పెరిగాయి. సతీష్ షా కుటుంబానికి చెందిన ఈ భూమి సుమారు ?1400 కోట్ల విలువ కలిగి ఉండగా, దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కన్నుపడింది. మంత్రి పొంగులేటి, ఆయన కుమారుడు హర్షా రెడ్డి కలిసి స్వయంగా సతీష్ షా ఇంటికి వెళ్లి, భూమిని డెవలప్మెంట్కు ఇవ్వకపోతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని బెదిరించారని అన్నారు.

అయితే సతీష్ షా కుటుంబం భూమిని డెవలప్మెంట్కు ఇవ్వడానికి గానీ, అమ్మడానికి గానీ సిద్ధంగా లేమని స్పష్టంగా తెలిపింది.దీనికి తరువాత మంత్రి పొంగులేటి అరాచకాలకు తెరలేపారు. తన రెవెన్యూ శాఖలోని శ్రీనివాసులు అనే అధికారి ద్వారా, ?100 కోట్ల లంచం కేసులో పట్టుబడిన ఏడీ (ంఆ) తో దొంగ సర్వే చేయించి బాధితులను తీవ్రంగా వేధింపులకు గురిచేశారు. భూమిని ఇవ్వకపోతే, రెవెన్యూ సర్వే పేరుతో 27 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటామని బెదిరించారు. దీనికీ లొంగకపోవడంతో హర్షా రెడ్డి, ఆయనకు చెందిన రాఘవ కన్స్ట్రక్షన్స్ గుండాలతో కలిసి, నంబర్ ప్లేట్లు లేని జేసీబీలతో వచ్చి బాధితులు నిర్మించుకున్న గోశాలను కూల్చివేశారని అన్నారు.

దాదాపు కిలోమీటర్ మేర ఉన్న కాంపౌండ్ వాల్ను కూడా ధ్వంసం చేసి,



బాధితులను భయభ్రాంతులకు గురిచేశారు.ఈ ఘటన విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన సతీష్ షా, పల్లవి షా కుటుంబ సభ్యులను అక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించి, రాత్రంతా నిలబెట్టారు. ఈ ఘటనపై పోలీసులు వద్ద ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రాష్ట్రపతి పతకం అందుకున్న నిజాయితీ గల పోలీస్ అధికారి హబీబుల్లాను బదిలీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి మధ్య ఉన్న వ్యాపార అనుబంధాన్ని అడ్డుపెట్టుకుని ఈ దురాగతాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్లో ఉన్న 20 లక్షల ఎకరాల భూమిని కోటి ఎకరాలకు పెంచి, నిషిద్ధ జాబితా పేరుతో ప్రజలను బెదిరిస్తూ 50 శాతం భూమి వాటా డిమాండ్ చేస్తోందని అన్నారు. ఇలాంటి అన్యాయాలకు గురైన బాధితులు ఎవరైనా ఉంటే తెలంగాణ భవన్కు వచ్చి వివరాలు ఇవ్వాలని, వారికి పార్టీ పరంగా మరియు న్యాయపరంగా అండగా ఉంటామని తెలిపారు. అక్రమంగా క్రషర్లు ఏర్పాటు చేసి మైనింగ్ చేస్తున్న మంత్రి పొంగులేటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్ను ప్రశ్నించిన మా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడి చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు.

# ఆ క్షణం చనిపోవాలనుకున్న: నటి హేమ?

డ్రగ్స్ కేసులో తీవ్రంగా మానసికంగా క్రుంగిపోయాను

ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ నటి హేమతో "మీట్ ది ప్రెస్"



తెలుగు సినిమా ఇండస్ట్రీలో నటి హేమ కు ప్రత్యేకమైన పరిచయం అవసరం లేదు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, తన సహజమైన నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. అదే సమయంలో నేరుగా, బహిరంగంగా తన అభిప్రాయాలను చెప్పే స్వభావం వల్ల కూడా తరచూ వార్తల్లో నిలుస్తూ ఉంటారు. టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా దశాబ్దాల పాటు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి హేమ ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ నటి హేమతో నిర్వహించిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమం హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్‌లో సోమవారంనాడు జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఇటీవల తనపై నమోదైన డ్రగ్స్ కేసు, దాని వల్ల తన కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులు, మీడియా పాత్ర వంటి అంశాలపై భావోద్వేగంగా స్పందించారు. తెలుగు ఫిలిం ఛాంబర్ లో ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో నటి హేమ మాట్లాడుతూ.... డ్రగ్స్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలు తనను తీవ్రంగా మానసికంగా కలచివేశాయని చెప్పారు. "ఆ సమయంలో నేను చచ్చిపోవాలనిపించింది. అంతగా మానసికంగా కుంగిపోయాను" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని, అందుకే చివరకు నిర్దోషిగా బయటకు వచ్చానని స్పష్టం చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో కొందరు మీడియా సంస్థలు తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లాయని ఆమె ఆరోపించారు. ఆ వార్తల కారణంగా తన వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులు కూడా తీవ్రంగా బాధపడ్డారని చెప్పారు. "నా కుటుంబం చాలా సఫర్ అయింది. మాకు ఇది చాలా కఠినమైన కాలం" అని ఆమె పేర్కొన్నారు. అయితే మొత్తం మీడియాను ఒకే తాటిపై వేయలేమని, నిజాయితీగా వ్యవహరించే మీడియా సంస్థలు తనకు మద్దతుగా నిలుస్తాయని తాను నమ్ముతున్నానని హేమ తెలిపారు. భవిష్యత్తులో కూడా మీడియా తనకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇసుక అక్రమ రవాణా నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం



రేగొండ, మార్చి 30 (భారత శక్తి): భూపాలపల్లి జిల్లా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు నాలుగు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు రేగొండ ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు.
వివరాల్లోకి వెళితే, రేగొండ మండలానికి చెందిన ట్రాక్టర్ యజమానులు గోల్లేనా కుమార్, శ్రీపతి మహేందర్, అంకం రాజేందర్, శ్రీనివాసరావు వారి ట్రాక్టర్లను డ్రైవర్లు నగేష్, నితిన్, రాజు తదితరులు ఎలాంటి చెల్లుబాటు అయ్యే అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు.
ఈ మేరకు సంబంధిత ట్రాక్టర్ యజమానులు మరియు డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ అలాగే, అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లు

**- గడువు దాటితే అదనపు రుసుము చెల్లించాలి**

**: మునిసిపల్ కమిషనర్ రమేష్**



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 30 (భారత శక్తి): ములుగు మునిసిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు.
ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీ అస్తి పన్ను 70 శాతం వసూలు అయిందనీ,
మునిసిపాలిటీ అభివృద్ధికి పన్నులు ప్రధాన ఆదాయ వనరని, ప్రతి పౌరుడు తన బాధ్యతగా గృహ పన్ను ఇతర పన్నులను సమయానికి చెల్లించాలని సూచించారు. బకాయిలు ఉన్న పన్నులను మార్చి 31 లోపు చెల్లించాలని ప్రజలను కోరారు.గడువు తేదీ తరువాత చెల్లించే పన్నులపై వడ్డీ విధించబడుతుందని, అదనపు భారాన్ని తప్పించుకోవడానికి గడువులోపే పన్నులు చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. లేని యెడల మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు : జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 30(భారత శక్తి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం సత్వరమే చర్యలు తీసుకోవాలని దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ప్రజావాణి – గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమం లో స్వయంగా ప్రజల నుండి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.స్వీకరించారు. ప్రజావాణి – గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమానికి భూ సమస్యలకు 32, ఇందిరమ్మ ఇళ్లకు 09, పెన్షన్ 32, ఉపాధి కల్పన 01,ఇతర సమస్యలు 22, మొత్తం 96 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రజా సమస్యల దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగం పెంచేలా చూడాలని, బిల్లుల చెల్లింపు లలో అలసత్వం వహించకూడదని పేర్కొన్నారు. ఎల్పిజి గ్యాస్, పెట్రోల్, డీజిల్ అక్రమంగా నిలువ చేసుకోకుండ అధికారులు తనిఖీలు చేపట్టాలని, ఉద్దేశపూర్వకంగా ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డిఆర్డిఓ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, డి ఎం హెచ్ ఓ వేణుగోపాలరావు, డిపిఓ వెంకయ్య, డీఈవో సిద్ధార్థ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తహసీల్దార్లు,
ఎంపి ఓ డి లు, ఎంపి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 నుండి నిర్వహించే గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 30: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో, ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.
ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ సభలు, వార్డు , మున్సిపల్ సభల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.
గ్రామ సభలు, మున్సిపల్ సభలను పండుగ వాతావరణంలో నిర్వహించడంతో పాటు ప్రజలు, ప్రజా ప్రతినిధులు చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణపై నివేదికలను సిద్ధం చేసి గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని, ప్రజా ప్రతినిధులకు ముందస్తుగా ఆహ్వానాలు పంపించాలని ఆదేశించారు. గ్రామాల్లో




టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.
ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులు తదితర వివరాలను గ్రామ సభల సందర్భంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు ?500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ?500 సిలిండర్ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను కరదీపికల రూపంలో తయారు చేసి సభకు వచ్చే ప్రతి ఒక్కరికి అందజేయాలని, అలాగే అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, గ్రామ సభలకు ప్రజలు అధికంగా హాజరయ్యేలా రెండు రోజుల ముందుగానే ప్రచారం నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు టెంట్లు, షామియానాలు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని,
మినిట్ టు మినిట్ కార్యక్రమ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు ఏర్పాట్లపై ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

## మెనూ కచ్చితంగా పాటించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

### -దుమాల ఈఎంఆర్ఎస్ విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ.



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 30 (భారత శక్తి ): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు.అనంతరం స్టోర్ రూమ్‌కు వెళ్ళి అక్కడ నిల్వ ఉన్న బియ్యం, నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, కూరగాయల నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించిన ఆమె, మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడిగుడ్లు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని ఆరా తీశారు. వసతి గదులు, తరగతి గదులను సందర్శించి పారిశుధ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పక్కా ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, భవిష్యత్తులో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 6 వ తేదీ లోపు అప్లై చేసుకోండి :ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక

### - జర్నలిస్టులకు అక్రెడిటేషన్ గడువు చివరి తేది.



హైదరాబాద్,మార్చ్ 30(భారత శక్తి ): తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డుల కోసం ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక సూచించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె పలు వివరాలు వెల్లడించారు.
జర్నలిస్టులు తమ యాజమాన్యాల నుంచి పొందిన సిఫార్సు లేఖతో పాటు అవసరమైన పేపర్ కటింగులు విద్యార్హతల సర్టిఫికెట్లు ఇండిపెండెంట్ జర్నలిస్టులు కటింగ్లతో పాటు సంబంధిత ఎడిటర్ పత్రికకు వార్తలు రాసినట్లు ధ్రువీకరించే లేఖ సంబంధిత అర్హత పత్రాలను జత చేయడంతో పాటు తాము వేరే ఇతర వృత్తులలో అనగా సొసైటీ చైర్మన్, డైరెక్టర్ ప్రభుత్వ ఉద్యోగం, న్యాయవాద వృత్తి, సర్పంచ్ తదితర ఇతరత్రా ఏ పదవుల్లో కొనసాగడం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ జతచేసి హార్డ్ కాపీని సంబంధిత డిపిఆర్ఓ కార్యాలయాలలో అందజేయాలని, అప్లికేషన్‌ను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై సంబంధిత అధికారులకు కఠిన చర్యలకై ఆదేశాలు ఇవ్వనున్నట్లు స్పెషల్ కమిషనర్ వెల్లడించారు

## ప్రజావాణిలో అందచేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి ప్రతినిధి, మార్చి 30 (భారత శక్తి): సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి మొత్తం 70 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు 3ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పరిష్కార స్వభావం దరఖాస్తు దారునికి తెలియచేయాలని ఆదేశించారు.
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని ఆయన సూచించారు.
దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా

### అమరవాది లక్ష్మీనారాయణను సన్మానించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ గుప్తా

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 30: జగదీశ్వర్ గుప్తా తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణను, కామారెడ్డి జిల్లా మాజీ మున్సిపల్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ గుప్తా, పసునూరి శ్రీనివాస్ గుప్తా, రమేష్ గుప్తా, వెంకన్న , చాట్ల రాజేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు సన్మానించారు.





# 'కాసరగోడ్ ఎంబసీ' (జీ 5) సిరీస్ రివ్యూ!

మలయాళంలో రూపొందిన వెబ్ సిరీస్ 'కాసరగోడ్ ఎంబసీ'. క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సిరీస్ కీ, అతీష్ నాయర్ దర్శకత్వం వహించాడు. కబీర్ దుహాన్ సింగ్ .. అబూ సలీమ్ ..గోవింద్ పాయ్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్, ఈ నెల 20వ తేదీ నుంచి 7 ఎపిసోడ్స్ గా 'జీ 5'లో మలయాళంలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి, తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. మంగుళూరులో ఆసిఫ్ చెమ్ము అనే ఇద్దరు టీనేజ్ కుర్రాళ్లు ఉంటారు. ఆసిఫ్ కి తండ్రి లేకపోవడం వలన, అతని ఆలనా పాలన మేనమామ రజాక్ చూసుకుంటాడు. అనాథ అయిన చెమ్ము, ఆసిఫ్ తో కలిసి పెరుగుతాడు. ఆసిఫ్ తో పాటు అతని మేనమామ షాపులో చెమ్ము పనిచేస్తూ ఉంటాడు. రజాక్ ఈ ఇద్దరితో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయిస్తూ, తక్కువ మొత్తం ఇస్తూ ఉంటాడు. తాము జైలుకు వెళ్లినా అతను పట్టించుకోకపోవడం వాళ్లను ఆలోచనలో పడేస్తుంది. ఆ సమయంలో వాళ్లను బెయిల్ పై రాయ్ థామస్ బయటికి తీసుకుని వస్తాడు. రాయ్ థామస్ ఎవరనేది అప్పుడే ఆసిఫ్ కీ .. చెమ్ముకి తెలుస్తుంది. అతను వాళ్లచే నకిలీ పాస్ పోర్టులు .. స్టాంప్ పేపర్స్ .. తయారుచేయిస్తూ, ఆనందకరమైన జీవితాన్ని అనుభవంలోకి తీసుకొస్తాడు. ఈ కుర్రాళ్ల పనితీరు గురించి కాసరగోడ్ లోని దామోదరరావు (కబీర్ దుహాన్ సింగ్)కి తెలుస్తుంది. అతను వాళ్లని రప్పించి ఆశ్రయమిస్తాడు. దేశం విడిచి పారిపోవానుకుంటున్న రాజకీయనాయకులకు .. తీవ్రవాదులకు నకిలీ పాస్ పోర్టులు తయారు చేయించడం అతని అక్రమ వ్యాపారాలలో ఒకటి. దామోదరరావును అందరూ 'దాము' అని పిలుస్తుంటారు. అతని ప్రధానమైన అనుచరులుగా 'పింటో' 'రాజా' ఉంటారు. విమాన ప్రమాదం వలన బయటపడిన ఉగ్రవాదులను వెతుకుతూ స్పెషల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ (దీపక్ పరంబోల్) కాసరగోడ్ చేరుకుంటాడు. అక్కడ ఏం జరుగుతుంది? ఆసిఫ్ చెమ్ము జీవితాలు ఎలాంటి మలుపు తిరుగుతాయి? అనేక అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తున్న 'దాము' పట్టుబడతాడా? అనేది మిగతా కథ. 'కాసరగోడ్' ను ప్రధానమైన కేంద్రంగా చేసుకుని, నకిలీ పాస్ పోర్టులు ఎలా తయారవుతున్నాయనే అంశం చుట్టూ అల్లుకుంటూ వెళ్లిన కథ ఇది. ఇక్కడి నుంచి చైల్డ్ ట్రాఫికింగ్ .. అక్రమ ఆయుధాల రవాణా జరుగుతున్నాయనేది డైలాగ్స్ పరంగానే చెప్పించారు. నకిలీ పాస్ పోర్టులు తయారు చేయడం అనే అంశాన్నే ప్రధానంగా తీసుకున్నారు. కథ అంతా కూడా ఈ విషయం చుట్టూనే తిరుగుతుంది. నకిలీ పాస్ పోర్టులకు సంబంధించిన వ్యవహారం ఎలా జరుగుతుంది? ఎక్కడెక్కడి నుంచి ఎవరెవరితో ఎలాంటి లింకులు ఉంటాయి? ఈ మాఫియాలో ఆధిపత్య పోరు ఎలా ఉంటుంది? మాఫియా ముఠాలోకి అడుగు పెట్టిన వాళ్లలో ఎవరి జీవితాలు ఎక్కువగా బలి అవుతుంటాయి? ఇలాంటి ఒక మాఫియా గ్యాంగ్ ను కట్టడి చేయడానికి రంగంలోకి దిగిన పోలీస్ ఆఫీసర్లకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనే అంశాలను ఆవిష్కరిస్తూ వెళ్లారు.

## తల్లినయ్యాక ఆడపులిలా మారాను : కియారా



అమ్మనయ్యాక తను జీవితాన్ని చూసే విధానమే మారిపోయిందని అంటోంది బాలీవుడ్ కథానాయిక కియారా అద్వాణీ. హీరోలకు దీటుగా యాక్షన్ సీన్స్‌తో అదరగొట్టే నాయికీమె. ప్రస్తుతం మాతృత్వ దశను ఆస్వాదిస్తున్న కియారా.. తల్లయిన తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి అభిమానులతో పంచుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ''ఇప్పుడు నేను ఆడపులిలా మారానని అనిపిస్తోంది. మునుపటి కంటే నా జీవితాన్ని చూసే కోణం భిన్నంగా ఉంది. ఒక్కోసారి మరేదీ ముఖ్యం కానట్టు అనిపిస్తుంది. కొన్ని సమయాల్లో ప్రతి చిన్న విషయం కూడా ముఖ్యమనే భావన కలుగుతుంది'' అని అంది. పెళ్లి తర్వాత తన భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో తన బంధం గురించి మాట్లాడుతూ.. ''పెళ్లికి ముందు మా మధ్య ఉన్న సరదా కబుర్లు, కలిసి ప్రయాణాలు చేయడం ఇవేమీ మారలేదు. ఇప్పటికీ మేమిద్దరం కలిసి సినిమాలు చూస్తాం. నటీనటులుగా, సినిమా ప్రేమికులుగా ఆ చిత్రాల గురించి చర్చించుకోవడం మాకు చాలా ఇష్టమ''ని చెప్పుకొచ్చింది. ''నాకు ఎప్పుడూ నటిని అవ్వాలని ఉండేది. చిన్నప్పుడే నాలో ఆ కోరిక ఉందని మా తల్లిదండ్రులు పసిగట్టారు. కానీ ముందుగా చదువు పూర్తి చేయాలని పట్టుబట్టారు. ఆ తర్వాత వారి ప్రోత్సాహంతోనే చిత్రపరిశ్రమలోకి వచ్చాను. వైఫల్యమే ఉత్తమ గురువు అని తెలుసుకున్నా. ఇక సినిమాల విషయానికొస్తే.. కథలు, పాత్రలతో కనెక్ట్ అయితే.. అంతకు మించి ఆలోచించను. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తాను. నేను దర్శకుడి నటిని. దర్శకుడికి, నటులకి మధ్య ఉండే అనుబంధమే ముఖ్యమని నమ్ముతాను''.

# సినిమా

## ప్రకాశ్ రాజ్ తల్లి కన్నుమూత



ప్రముఖ విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ తల్లి సువర్ణలత ఇవాళ కన్నుమూశారు. వేల పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి కోట్లాది మందిని మెప్పించిన ప్రకాశ్ రాజ్‌ను కుదిపేసిన విషాదం ఇది. తన ఎదుగుదలకు పునాదిగా నిలిచిన మాతృమూర్తి 'స్వర్ణలత' ఇక లేరన్న వార్త ఆయనను తీవ్రంగా కలచివేసింది. గతంలో తన ఐదేళ్ల కుమారుడు సిద్ధు మరణంతో కుంగిపోయిన ప్రకాశ్ రాజ్‌కు, అమ్మ తోడు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఆ నీడ కూడా దూరమవ్వడంతో ఆయన ఒక్కసారిగా మూగబోయారు. అమ్మ అంటే తనకు కేవలం ఒక బంధం మాత్రమే కాదని, ఒక గొప్ప ప్రేరణ అని ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో ప్రకాశ్ రాజ్ చెప్పారు. కాగా ఇవాళ సాయంత్రం బెంగళూరులో స్వర్ణలత అంత్యక్రియలు జరగనున్నాయి.

## మీనాక్షి పెళ్లి కూతురైంది



నవ వధువులా హొయలు పోతూ ఫొటోలకు పోజులిచ్చింది మీనాక్షి చౌదరి. ఇప్పుడు ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దాదాపు 20 ఫొటోలు, ఒక చిన్న వీడియోను ఆమె పంచుకుంది. ఈ పోస్ట్‌లోని ఒక వీడియో ప్రత్యేకంగా అందరి దృష్టిని ఆకర్షించింది. అందులో మీనాక్షి చౌదరి వధువు లుక్‌లో సంప్రదాయ దుస్తులు, ఆభరణాలతో కనిపిస్తూ సిగ్గుగా నవ్వుతూ నడుస్తోంది. దీంతో నెటిజన్లు ఆమె పెళ్లి జరుగుతోందా? అంటూ కామెంట్లు చేస్తున్నారు. కొందరు ఇది నిజమైన పెళ్లి వీడియోగా కూడా భావించారు. ఈ రూమర్లలో నిజం లేదని స్పష్టమైంది. ఆ వధువు లుక్ ఒక షూట్‌లో భాగమేనని, వ్యక్తిగత జీవితంతో సంబంధం లేదని తెలిసింది. మిగతా ఫొటోలు కూడా ట్రావెల్, షూటింగ్, సాధారణ క్షణాల మిశ్రమంగా ఉన్నాయని తెలుస్తోంది. ఇటీవల తన పెళ్లి గురించి వస్తున్న వార్తల పై కూడా మీనాక్షి చౌదరి స్పందించింది. తాను త్వరలో పెళ్లి చేసుకునే ఆలోచనలో లేనని, ఇలాంటి గాసిప్‌లతో విసిగిపోయానని తెలిపింది. ప్రస్తుతం తన దృష్టి పూర్తిగా కెరీర్‌పైనే ఉందని స్పష్టం చేసింది. మంచి కథలు, విభిన్న పాత్రలు చేయాలనే లక్ష్యంతో ఉన్న ఆమె, ప్రస్తుతం 'అనగనగా ఒక రాజు' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.

## మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి

రణ్ వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం ధురంధర్ 2. మార్చి 19న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. కేవలం 10 రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.1250 కోట్లకు పైగా కలెక్షన్స్ వసూలు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ మూవీ గురించి తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశాడు. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ప్రస్తావించాడు. ఈ సినిమా సాధించిన విజయం ఒక అణుబాంబు లాంటిదన్నాడు. 'ధురంధర్ 2 పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. కళ్లెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే.. దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. ఈ సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని సలహా ఇచ్చాడు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



## 'ధురంధర్ 2'తో అణుబాంబు పేల్చాడు.. వారి మౌనంపై ఆర్జీవీ పోస్ట్



దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ''ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో''. ''కళ్లెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2'సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి'' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'..**

రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల (రూ.1,307 కోట్లు)ను ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది.

# ఏప్రిల్ 1న ఒంటిమిట్ట సీతారాముల కళ్యాణం నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

* **భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్ మళ్లింపు.**
* **వాహనదారులు పోలీసు శాఖకు సహకరించాలి: జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్**

కడప మార్చి 30(భారత శక్తి): ఏప్రిల్ 1 న బుధవారం ఒంటిమిట్ట లో జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కడప నగరంలో, ఒంటిమిట్ట రహదారి, రేణిగుంట రహదారిపై ట్రాఫిక్ మళ్లింపు అమలులో ఉంటుందని జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్.పి గారు పత్రికా ప్రకటన విడుదల చేశారు. మళ్ళింపు ఏప్రిల్ నెల 1 వ తేదీ ఉదయం 9:00 గంటల నుండి 2 వ తేది ఉదయం 8:00 గంటల వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ సందర్బంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాతీయ రహదారి716 మీదుగా వచ్చు భారీ వాహనాలను రేణిగుంట, రాజంపేట, కడప వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల ద్వారా జాతీయ రహదారి716 మీదుగా కాకుండా ఇతర మార్గాలలో ఏప్రిల్ 1వ తేది ఉదయం 9:00 గం.ల నుండి 2వ తేది ఉదయం 8:00 గం.ల వరకు దారి మళ్ళించడం జరుగుతుంది. రాజంపేట వైపు నుండి వచ్చు ద్విచక్ర వాహనాలు, ఆర్.టి.సి. బస్సులు ఒంటిమిట్ట మండలం సాలాబాద్ క్రాస్ వద్ద మరియు సిద్ధవటం మండలం ఉప్పరపల్లి సాయిబాబా గుడి వద్ద ఏప్రిల్ 1 వ తేది ఉదయం 9:00 గం.ల నుండి 2 వ తేది ఉదయం 8:00 గం.ల వరకు దారి మళ్ళించడం జరుగుతుందని ఎస్.పి తెలిపారు.

**వాహనాల దారి మళ్లింపు వివరాలు:**

కడప నుండి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం అలంఖాన్ పల్లి ఇర్కాన్ జంక్షన్ నుండి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్ళాలి.తిరుపతి నుండి కడప వైపు వచ్చే భారీ వాహనాలు, రవాణా వాహనాలు రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలి.రాజంపేట వైపు నుండి కడప వెళ్లే భారీ వాహనాలను రాయచోటి మీదుగా దారి మళ్లింపు. రాజంపేట వైపు నుండి వచ్చే ద్విచక్ర వాహనాలు సాలాబాద్ నుండి ఇబ్రహీం పేట, మాధవరం మీదుగా పంపబడును.

18 చోట్ల పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు:

శ్రీ సీతారామ కళ్యాణానికి రాజంపేట వైపు నుండి వచ్చే భక్తులు టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను సాలాబాద్ సమీపంలో 5 చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో క్రమపద్ధతిలో నిలపాలి. కల్యాణ వేదిక నుండి కడప మార్గంలో 13 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం జరిగింది. కడప రహదారి వైపు పార్కింగ్ ప్రదేశాల వివరాలు: కడప వైపు నుండి ఒంటిమిట్ట వచ్చే భక్తుల కొరకు 13 ప్రదేశాలలో పార్కింగ్ ఏర్పాటు చేయడమైనది.

1. ఫోర్ వీలర్స్ కు జనరల్ పార్కింగ్ చలమయ్య యాదవ్ సైట్ మాధవరం 1 (హెచ్ పి పెట్రోల్ బంక్ తూర్పు వైపున)
2. త్రీ వీలర్స్ కు పార్కింగ్ కనకదుర్గ కళ్యాణ మండపంకు పడమటి వైపున మాధవరం1
3. కార్ పార్కింగ్ కనకదుర్గ కళ్యాణ మండపం తూర్పు వైపున మాధవరం 1
4. కార్ పార్కింగ్ సన్నీ ఫుడ్ కోర్ట్ ఫ్యామిలి ధాబా తూర్పు వైపు
5. కార్ పార్కింగ్ సన్నీ ఫుడ్ కోర్ట్ ఫ్యామిలి ధాబా పడమటి వైపు
6. కార్లు, ట్రాక్టర్ లు, లారీ ల పార్కింగ్ ఫోర్ వీలర్లకు సన్నీ ఫుడ్ కోర్ట్ నుండి పడమటి వైపు సాయిబాబా గుడి, ఉప్పరపల్లి గ్రామం (ట్రాఫిక్ మళ్లింపు ప్రదేశం)



7. కార్ పార్కింగ్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం , కొత్త మాధవరం(ఫారెస్ట్ చెక్ పోస్ట్ ఎదురుగా)
8. ఆర్.టి.సి బస్సుల పార్కింగ్ - శ్రీ షిర్డీ సాయి డిగ్రీ కాలేజి, ఓబుల్ రెడ్డి వాటర్ ప్లాంట్/ స్పైసెస్ బోర్డు మధ్యలో
9. ఫ్రీ బస్సులు, వి.ఐ.పి కార్ పార్కింగ్ శ్రీ షిర్డీ సాయి డిగ్రీ కాలేజి, రాయలసీమ హోటల్ (వి.వి.ఐ.పి & వి.ఐ.పి ఎంట్రెన్సు ఆర్చి ఎదురుగా)
10. పోలీసు వాహనాల పార్కింగ్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ & మయూర హోటల్ మరియు వెనుక వైపు
11. ఇతర శాఖల వాహనాల పార్కింగ్ ఈద్గా పక్కన, ఒంటిమిట్ట (కార్ పార్కింగ్)
12. టి.టి.డి వాహనాల పార్కింగ్ కళ్యాణ వేదిక ప్రధాన ప్రవేశం ఆర్చ్ వద్ద ఉన్న సత్రం వద్ద
13. టూ వీలర్, కార్ పార్కింగ్ - కళ్యాణ రామ టౌన్ షిప్ & బ్రిడ్జి ప్రక్కన, దర్జిపల్లి రోడ్, కొత్త పల్లి గ్రామ

* **సమీపంలో,రాజంపేట రహదారి వైపు పార్కింగ్ ప్రదేశాల వివరాలు:**

1. ఆర్.టి.సి బస్సు పార్కింగ్ సాలాబాద్ క్రాస్ వద్ద
2. ఫోర్ వీలర్ , టూ వీలర్ పార్కింగ్మదరసా, మలకాటి పల్లి గ్రామం.
3. ఫోర్ వీలర్, టూ వీలర్ పార్కింగ్మలకాటి పల్లి గ్రామం వద్ద.
4. వి.ఐ.పి కార్ పార్కింగ్ బి.సి బాయ్స్ హాస్టల్, ఒంటిమిట్ట టౌన్
5. వి.ఐ.పి కార్ పార్కింగ్ దుర్గమ్మ గుడి ముందు వైపు, ఒంటిమిట్ట టౌన్ లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.కావున వాహనదారులు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ అన్నారు.



# రమాదేవి కులకర్ణి కథల సంపుటి గగ్గమ్మ పుస్తకావిష్కరణ

హైదరాబాద్,మార్చి 30(భారత శక్తి): హైదరాబాద్ కూకట్ పల్లి లోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన్ భవన్ లో తపస్వి మనోహరం అంతర్జాల మాస, వార పత్రిక, పబ్లికేషన్స్ సంస్థ,5వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి.ఈసందర్బంగా ప్రముఖ రచయిత్రి, కవయిత్రి వ్యక్తిత్వ, వికాస నిపుణులు, తపస్వి మనోహరిలో "కాసేపు నాతో "శీర్షిక కాలమిస్ట్, రమాదేవి కులకర్ణి కథల సంపుటి "గగ్గమ్మ" పుస్తకావిష్కరణ ఘనంగా చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, శ్రీ చంద్రప్రతాప్, కంతేటి, ప్రముఖ కవి, నటులు, సినీ గేయ రచయిత,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ నంది,ఉగాది పురస్కార గ్రహీత, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయ బంగారు పతక విజేతశ్రీ సాదనాల వెంకట స్వామీ నాయుడు,ప్రముఖ నవలా రచయిత, కథ, నవల, రేడియో, బుల్లితెర, సినిమా రచయిత, నటుడు, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, కళా రత్న, నంది అవార్డుల గ్రహీత శ్రీ పి. చంద్రశేఖర ఆజాద్,తపస్వి సంస్థ సిఈఓ నిమ్మగడ్డ అవినాష్ కార్తిక్, డైరెక్టర్స్ అఖిల, బుజ్జమ్మ, విజయ పాల్గొన్నారు.రచయిత్రి వివిధ పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ఇరవై రెండు కథల సమాహారమే గగ్గమ్మ అని విశ్లేషించారు.ఈ కార్యక్రమంలో కవులు కళా కారులు తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా రాముల వారి కల్యాణోత్సవం

* **కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదు: జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్.సవిత**
* **భక్తులకు సౌకర్యవంతం గా ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

కడప, మార్చి 30(భారత శక్తి ప్రతినిధి): అంగరంగ వైభవంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి కళ్యాణం ను నిర్వహించేందుకు అందరూ కలిసి బాధ్యత యుతంగా పనిచేసే విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారికి ఏప్రిల్ 01 కల్యాణోత్సవం సందర్భం గా రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాల సమర్పణ మరియు కళ్యాణోత్సవం ను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ మరియు జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లపై జిల్లా ఇన్చార్జి మంత్రి సోమవారం మధ్యాహ్నం ఒంటిమిట్ట టిటిడి అతిధి గృహం నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, టిటిడి జేఈఓ వీరబ్రహ్మం లతో కలిసి సమన్వయ సమావేశం టిటిడి మరియు జిల్లా అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి కళ్యాణం ను అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతున్నదనన్నారు. మరియు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు టీటీడీ మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో గత పది రోజులుగా పనిచేయడం జరుగుతున్నదన్నారు. గ్యాలరీలలో త్రాగునీరు ప్రసాదాల పంపిణీ, ఎక్కడ భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ కళ్యాణోత్సవం నకు వచ్చే భక్తులకు గ్యాలరీలలోకి వెళ్లక ముందే ప్రసాదం అంద జేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని,ప్రతి గ్యాలరీలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సెక్టోరల్ అధికారులను ఇన్చార్జిగా నియమించి పర్యవేక్షించడం జరుగు తున్నదని,భక్తులందరూ కల్యాణం ను తిలకించేందుకు ఎల్ఈడి స్క్రీన్ లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మే ఐ హెల్ప్ యు బృందాలు భక్తులకు సహాయ సహకారాలు అందించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున భద్రత, పార్కింగ్,అన్న ప్రసాదాల పంపిణీ,తాత్కాలిక మరుగు దొడ్లు,నిరంతరాయ విద్యుత్ సరఫరా,ప్రథమ చికిత్స కేంద్రాలు,ఆర్టీసీ బస్సులు, హెల్ప్ డెస్కులు,సూచిక బోర్డులు,పారిశుద్ధ్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ వంటి అన్ని విభాగాలు సమిష్టిగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వివరించారు. టిటిడి తరపున కల్యాణోత్సవం నకు చేసిన ఏర్పాట్ల ను జె ఈ ఓ వి.వీర బ్రహ్మం వివరించారు. ట్రాపిక్ నియంత్రణ కు చర్యలు తీసుకొంటూ భక్తుల రద్దీకి అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం, కమాండ్ కంట్రోల్ ద్వారా భక్తులకు సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించేందుకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు సంబంధిత భద్రత అంశాలను సివిఎస్ఓ మురళీకృష్ణ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ వివరించారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన,ఏఎస్పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే ,కమలా పురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి,నాయకులు భూపేష్ రెడ్డి,రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి,జగన్ మోహన్ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గార్డెన్ లేకపోయినా.. పచ్చదనం ఆస్వాదించేలా..!

**అలసిపోయినా, ఒత్తిడికి గురైనా.. కాసేపు పచ్చటి మొక్కల మధ్య సేదదీరితే ఆ హాయే వేరు! అందుకే ఎప్పుడైనా మూడ్ బాగోలేకపోతే.. ఇంటి ఆవరణలో ఏర్పాటుచేసుకున్న గార్డెన్‌లో గడుపుతుంటాం. తద్వారా మనసు పునరుత్తేజితమవడంతో పాటు అలసట కూడా దూరమవుతుంది. అలాగని ప్రతి ఇంట్లో గార్డెన్ ఉండాలని లేదు.. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంపై ఆసక్తి చూపకపోవచ్చు. అయినా పచ్చదనాన్ని ఆస్వాదించాలంటే కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలున్నాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..**



**పార్కుకు వెళ్లండి!**

రోజూ ఉదయం లేదా సాయంత్రం వీలు చూసుకొని కాసేపు వ్యాయామం చేయడం చాలామందికి అలవాటు! ఇదే విధంగా దగ్గర్లోని పార్కుకు వెళ్లడం కూడా రోజువారీ అలవాటుగా మార్చుకోమంటున్నారు నిపుణులు. అదీ కుదరకపోతే పార్కులోనే వ్యాయామాలు చేసేలా ప్లాన్ చేసుకోవచ్చు. తద్వారా ఇటు వ్యాయామం చేసినట్లవుతుంది.. అటు పచ్చదనం మధ్య కాసేపు గడిపినట్లుగానూ ఉంటుంది. అంతేకాదు.. పక్షుల కిలకిలారావాలు, ఫౌంటెయిన్స్ శబ్దాలు.. వంటివన్నీ మనసుకు ఆహ్లాదాన్ని పంచేవే! కాబట్టి కుటుంబమంతా కలిసి రోజూ ఓ అరగంట పార్కులో గడిపేలా సమయం కేటాయించుకోండి. ఇలా రోజూ కాసేపు ప్రకృతితో గడపడం వల్ల దీర్ఘాయుష్షే కాదు.. పనిలో నాణ్యత, పిల్లల్లో ప్రతిభ పెరుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

**ఇండోర్ మొక్కలతో..**

కొంతమంది ఇంట్లో తగినంత ప్రదేశం లేకపోవడం వల్ల గార్డెనింగ్ చేసుకోలేకపోతారు. అలాంటి వారు చిన్న చిన్న మొక్కలతో ఇంటి ముంగిలిని అందంగా





తీర్చిదిద్దుకోవచ్చు.. ఇంట్లోనూ కొన్ని ఇండోర్ మొక్కల్ని ఏర్పాటు చేసుకోవచ్చు. దానివల్ల ఇల్లంతా ఆహ్లాదకరంగా మారిపోతుంది. పైగా ఈ చిన్న మొక్కల్ని మెయింటెయిన్ చేయడం కూడా సులువు.

**గోడలకు 'గ్రీనరీ' హంగులు!**

ఇంట్లో గార్డెన్ ఏర్పాటు చేసుకునేంత ఖాళీ ప్రదేశం లేదా? మొక్కలు పెంచుకునేంత తీరికా లేదా? అయినా పచ్చదనాన్ని ఆస్వాదించచ్చు.. అదెలాగంటే..? గోడలకు గ్రీనరీ హంగులద్దుతూ! ఇందులో భాగంగా ప్రకృతి/పక్షులు/అడవులు/జలపాతాలు.. ఇలా బయట దొరికే వాల్ పేపర్లను తెచ్చుకొని ఇంట్లో గోడలకు అతికించుకోవచ్చు. మరింత న్యాచురల్ లుక్ కావాలనుకునే వారు గోడలకు వాల్ ఆర్ట్ వేయించుకోవచ్చు. పచ్చదనానికి సంబంధించిన సీనరీలు/ఫొటోల్ని గోడకు అక్కడక్కడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇక అవకాశం ఉన్నట్లయితే ఇండోర్ వాల్ గార్డెన్ ట్రెండ్‌ను ఫాలో అవ్వచ్చు.

**పూలంటే ఇష్టమా?**

పువ్వులు, వాటి పరిమళాల్ని ఇష్టపడే వారు.. నచ్చిన పూల మొక్కల్ని ఇంట్లో ఉన్న కాస్త ప్రదేశంలోనే పెంచుకోవచ్చు.. లేదంటే అచ్చం పూల మాదిరిగా కనిపించే ఆర్టిఫిషియల్ పూల మొక్కల్ని ఇంట్లో అమర్చుకోవచ్చు. ఇలా వీటి రంగులూ మనసులోని ఒత్తిళ్లను దూరం చేసి ఆహ్లాదాన్ని పంచుతాయి అంటున్నారు నిపుణులు.




# అక్రమ గ్యాస్ సిలిండర్ల విక్రయ ముఠా అరెస్ట్

* డ్రైవర్ల చూపుపై 'మల్కాజ్గిరి కమిషనరేట్' నిఘా!
* 'అరైవ్ అలైవ్'లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం
* 76 మందికి పరీక్షలు.. 8ఎనిమిది మందికి శుక్లాలు గుర్తింపు

చెర్లపల్లి, మార్చి 30 (భారతశక్తి) : రహదారి భద్రతే లక్ష్యంగా, వాహన చోదకుల ఆరోగ్య సంరక్షణ కోసం మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కీలక ముందడుగు వేసింది. 'అరైవ్ అలైవ్' (Arrive Alive) మూడో దశ కార్యక్రమంలో భాగంగా, మల్కాజ్గిరి సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో సోమవారం చెర్లపల్లిలోని హెచ్‌పీసీఎల్ (HPCL) ప్రాంగణంలో భారీ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

**లోపాలు ఉంటే ప్రమాదమే..**

రహదారిపై వాహనం నడిపే వ్యక్తికి కంటి చూపు అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 76 మంది భారీ వాహన (HMV) డ్రైవర్లకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించారు. ఈ పరీక్షల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

* **ఎనిమిది మంది డ్రైవర్లకు శుక్లాలు ఉన్నట్లు తేలింది.**

31 మందికి దృష్టి లోపం ఉండటంతో కళ్లద్దాలు వాడాలని వైద్యులు సూచించారు. ఐదుగురిలో వర్ణ అంధత్వం (Colour Blindness), ఇద్దరిలో రెటినా సమస్యలను గుర్తించారు. ఒక డ్రైవర్‌కు కేవలం ఒక్క కన్ను మాత్రమే పని చేస్తున్నట్లు నిర్ధారించారు. ఇలాంటి సమస్యలతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

**సమిష్టి కృషితో భద్రత:**

మల్కాజ్గిరి సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి శ్రీమతి సావిత్రి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతా విభాగం డీసీపీ, ప్లాంట్ ఇన్‌ఛార్జ్ సురేష్, సేఫ్టీ మేనేజర్ ప్రవీణ్, చెర్లపల్లి లా అండ్ ఆర్డర్ సీఐ తదితరులు పాల్గొన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు, ముఖ్యంగా నిరంతరం రోడ్లపై ఉండే డ్రైవర్ల ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

**నివారణే మేలు..**

కేవలం జరిమానాలు విధించడమే కాకుండా, డ్రైవర్లలో అవగాహన కల్పించడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించవచ్చని పోలీసు అధికారులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో ఇటువంటి శిబిరాలను నిర్వహిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు.






## రెడ్డిపల్లి గ్రామంలో
# ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశం

* ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల



మెదక్, భారత శక్తి న్యూస్,మార్చి 30 : మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమలల్లో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి లు పాల్గొన్నారు. సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి కి రుణపడి ఉంటామని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు.

# అక్రమ గ్యాస్ సిలిండర్ల విక్రయ ముఠా అరెస్ట్




హైదరాబాద్, మార్చి 30 (భారత శక్తి): బంజారాహిల్స్‌లో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్న 10 మంది వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) బృందం, బంజారాహిల్స్ పోలీసులతో కలిసి జరిపిన సంయుక్త దాడిలో భారీగా గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

**ముఖ్య వివరాలు:**

అరెస్ట్ అయిన వారు: 10 మంది.
స్వాధీనం చేసుకున్న సిలిండర్లు: మొత్తం 414 (వివిధ పరిమాణాలు).
సీజ్ చేసిన వాహనాలు: 10 (డీసీఎంలు, బొలెరో, టాటా ఏస్ మరియు ఆటోలు).
మొత్తం విలువ: సుమారు ₹ 21,88,000/.

**నిందితుల వివరాలు:**

మొహమ్మద్ అమీర్ (42): గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు (ప్రధాన నిందితుడు).మొహమ్మద్ యూసుఫ్ (32): గ్యాస్ డెలివరీ బాయ్.మొహమ్మద్ ఇస్మాయిల్ (27): గ్యాస్ డెలివరీ బాయ్. ఎ. రామారావు (42): గ్యాస్ డెలివరీ బాయ్.లోక్ కుమార్ (24): బంజారాహిల్స్ నివాసి. మొహమ్మద్ సక్రుద్దీన్ (42): కూలీ.మొహమ్మద్ ముంతాజ్ అన్సారీ (35): డ్రైవర్. మొహమ్మద్ మినాజ్ అన్సారీ (42): కూలీ.రాజేష్ పాల్ (36): డ్రైవర్.రామ్ రాజ్ సింగ్ (54): నల్ల పోచమ్మ దేవాలయ అధ్యక్షుడు (స్థల యజమాని/అద్దెకు ఇచ్చిన వ్యక్తి).

**నేర విధానం (Modus Operandi):**

ప్రధాన నిందితుడు మొహమ్మద్ అమీర్, శంషాబాద్ కేంద్రంగా "మెట్రో గ్యాస్ ఏజెన్సీ" నిర్వహిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా, ఇతడు బంజారాహిల్స్ నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలోని ఒక స్మశాన వాటికలో గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ (Dumping) చేస్తున్నాడు. అక్కడి నుండి తన సిబ్బంది సహాయంతో అవసరమున్న ఖాతాదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా లాభాలు గడిస్తున్నట్లు విచారణలో తేలింది.

**పోలీసుల చర్య:**

విశ్వసనీయ సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ యదేందర్, ఎస్ఐ డి. రవిరాజ్ వారి బృందం, బంజారాహిల్స్ పోలీసులతో కలిసి ఈ దాడి నిర్వహించారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, కమిషనర్ టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఐపీఎస్ తెలిపారు.

## 99 రోజుల ప్రజాపాలన
# ప్రగతి ప్రణాళిక ఏర్పాట్లు చేయాలి

: **కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి ప్రతినిధి, మార్చి 30 (భారత శక్తి ): ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితా చదివి వినిపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ, పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీల సంక్షేమానికి 'ఇంధన' భరోసా!

* బేగంపేటలో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ ప్రారంభం
* ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి
* ఆదాయం మొత్తం సిబ్బంది సంక్షేమ నిధికే..
* ఏప్రిల్ 1 నుంచి సామాన్యులకు అందుబాటులోకి




— డీజీపీ శివధర్ రెడ్డి

బేగంపేట, మార్చి 30 (భారతశక్తి) : పోలీసుల సంక్షేమానికి భరోసానిస్తూ తెలంగాణ పోలీస్ శాఖ మరో ముందడుగు వేసింది. విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే సిబ్బంది కుటుంబాల అభ్యున్నతే లక్ష్యంగా బేగంపేటలో నూతనంగా నిర్మించిన 'తెలంగాణ పోలీస్ వెల్ఫేర్ ఫ్యూయల్ స్టేషన్'ను రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. మల్కాజిగిరి సీపీ అవినాష్ మహంతి, ఐజీపీ (ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్) గజరావు భూపాల్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసిన డీజీపీ.. ఈ కేంద్రాన్ని జాతికి అంకితం చేశారు.

**సంక్షేమ నిధికి ఊతం:**

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. కేవలం శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా, సిబ్బంది ఆర్థిక పరిపుష్టి కోసం ఇలాంటి ప్రాజెక్టులు అవసరమని పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (IOCL) సహకారంతో ఏర్పాటు చేసిన ఈ పెట్రోల్ బంక్ ద్వారా వచ్చే లాభాలను పూర్తిగా పోలీస్ వెల్ఫేర్ ఫండ్‌కు మళ్లిస్తామని చెప్పారు. దీనివల్ల పోలీసు కుటుంబాలకు వైద్య, విద్యా సంబంధిత సాయం అందించడం సులభతరమవుతుందన్నారు. "నాణ్యమైన ఇంధనాన్ని అందించడమే మా లక్ష్యం. కల్తీకి తావులేకుండా ప్రజల నమ్మకాన్ని ఈ బంక్ గెలుచుకుంటుంది."

**ఏప్రిల్ 1 నుంచి ఫుల్ సర్వీస్**

నగరవాసుల సౌకర్యార్థం ఈ ఫ్యూయల్ స్టేషన్ ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని మల్కాజిగిరి సీపీ అవినాష్ మహంతి తెలిపారు. కస్టమర్లతో మర్యాదపూర్వకంగా మెలిగేలా, నాణ్యతలో రాజీ పడకుండా సేవలు అందించేలా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులతో పాటు ఐఓసీఎల్ ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను
# ప్రభుత్వం నెరవేర్చాలి: విజయశాంతి



హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు." అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అమరవీరుల కుటుంబాలకు నెలకు రూ.25వేల పింఛన్ ఇస్తామని చెప్పాం. ఉద్యమకారులపై కేసులు ఎత్తేసి.. ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని చెప్పాం. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా.. ఉద్యమకారులకు న్యాయం జరగలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యమకారులు అడుగుతున్నారు. వారికిచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి'' అని విజయశాంతి డిమాండ్ చేశారు.

## ఏప్రిల్ 01 న రాష్ట్ర ముఖ్యమంత్రి
# జిల్లా పర్యటన ను విజయవంతం చేయండి

: **జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



వై ఎస్ ఆర్ కడప,మార్చి30(భారత శక్తి ): ఏప్రిల్ 1వ తేదీన వైయస్సార్ కడప,ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను అధికారులందరూ సమన్వయంతో సమిష్టిగా పనిచేసే విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 01 న కల్యాణోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు సమర్పించేందుకు విచ్చేస్తున్న నేపథ్యంలో టీటీడీ మరియు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.కళ్యాణోత్సవం లో భాగంగా కళ్యాణం ను తిలకించేందుకు వచ్చే వివిఐపీలు,విఐపి ల గ్యాలరీ నిర్వహణకు ఇప్పటికే రూపొందించిన ప్రణాళిక ప్రకారం అధికారుల నియామకం చేసిన వారికి శిక్షణ కార్యక్రమ నిర్వహణ తో పాటు మాక్ డ్రిల్ నిర్వహణ నుపక్కాగానిర్వహించాలనన్నారు.గ్రీన్ రూమ్ ఏర్పాటు, హెలిప్యాడ్ వద్ద,గ్యాలరీ లలో పటిష్ట బ్యారికేడింగ్ వ్యవస్థ, పాసుల పంపిణీ,గ్యాలరీ ల నిర్వహణ, గ్యాలరీలలో ప్రసాదం పంపిణీ,వైద్య సేవలు,కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహణ,సంబంధిత అంశాలపై సమీక్షించారు. కళ్యాణోత్సవం రోజున భక్తులకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం "May I Help You" బృందాలు చేయడం జరిగిందన్నారు. వీరికి ఇన్చార్జి అధికారులుగా సెక్టోరియల్ అధికారులను నియామకం చేపట్టి ఈ బృందాలను పర్యవేక్షించడం జరుగుతున్నదన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జెసి డా.నిది మీనా,రాజంపేట సబ్ కలెక్టర్ భావన, డి ఆర్ వో మల్లికార్జున, జిల్లా అధికారులు, ఆర్డీవోలు తదితరులు కలరు.

# ఇరాన్‌కు ఏప్రిల్ 6 డెడ్‌లైన్.. చమురు క్షేత్రాలే తమ టార్గెట్ అన్న ట్రంప్

- ఇరాన్ చమురు, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామన్న ట్రంప్
- ఏప్రిల్ 6లోగా షరతులు అంగీకరించకపోతే దాడులని హెచ్చరిక
- పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో పరోక్ష చర్చలు జరుగుతున్నాయని వెల్లడి
- ఇరాన్ కొత్త నాయకత్వంపై అనుమానాలు వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు
- ఇప్పటికే 13,000 లక్ష్యాలపై దాడులు పూర్తి చేశామని ప్రకటన

అమెరికా : పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టమవుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లోని చమురు నిల్వలను, ఆ దేశ వాణిజ్యానికి గుండెకాయలాంటి ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో వెనిజువెలాలో నికోలస్ మదురోను పట్టుకున్న తర్వాత అక్కడి చమురు పరిశ్రమను నియంత్రించినట్లే, ఇరాన్‌లోనూ చమురును తీసుకోవడానికే తాను మొగ్గుచూపుతానని స్పష్టం చేశారు. "నిజం చెప్పాలంటే ఇరాన్ చమురును తీసుకోవడమే నాకు ఇష్టమైన పని. కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవాలని ఉంది" అని ట్రంప్ పేర్కొన్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఇరాన్ చమురు ఎగుమతుల్లో 90 శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతాయి. దీనిని స్వాధీనం చేసుకుంటే ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి తీసుకురావచ్చని అమెరికా భావిస్తోంది. అయితే, ఈ చర్యతో అమెరికా దళాలకు ముప్పు పెరిగే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యుద్ధం ఐదో వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో ఇరాన్‌తో భూతల పోరు కోసం సుమారు 10,000 మంది సైనికులను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఇరాన్‌లోని 13,000 లక్ష్యాలపై బాంబు దాడులు చేశామని, మరో 3,000 లక్ష్యాలు మిగిలి ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీలోపు తమ షరతులకు అంగీకరించకపోతే ఇరాన్ చమురు మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని గడువు విధించారు. మరోవైపు, పాకిస్థాన్ రాయబారుల ద్వారా ఇరాన్‌తో పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయని, అవి సానుకూలంగా ఉన్నాయని ట్రంప్ వెల్లడించారు. అయితే, ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. "ఆయన బహుశా మరణించి ఉండొచ్చు లేదా తీవ్ర అనారోగ్యంతో ఉండొచ్చు. ఆయన కనిపించకుండా పోయారు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్ మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తూ, తమ నాయకత్వం సురక్షితంగా ఉందని స్పష్టం చేస్తోంది.

## దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన..

ఢిల్లీ, మార్చి 30 (భారతశక్తి) : భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు. ఇందులో భాగంగా, చాలా కాలంగా కలిసి ఉంటున్న సహజీవన జంటలను ఇకపై 'కుటుంబం'గా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఈరోజు వివరాలను వెల్లడించారు.

**రెండు దశల్లో జనగణన:**

తొలి దశ (ఏప్రిల్ 1 నుంచి): ఈ దశలో 'గృహ గణన' చేపడతారు. అధికారులు మొబైల్ యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి గృహాల వివరాలను సేకరిస్తారు. రెండో దశ (వచ్చే ఏడాది ఫిబ్రవరి): ఈ దశలో అసలైన జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. జనగణన కోసం కేంద్రం ప్రత్యేకంగా 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇందులో కుటుంబ యజమాని వివరాలు, కులం, కమ్యూనిటీతో పాటు ఇంట్లోని వసతులపై ఆరా తీయనున్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్ నుంచి కారు వరకు), టీవీ, రేడియో వంటి గృహోపకరణాలపై ప్రశ్నలు ఉంటాయి. తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సౌకర్యాలు, వినియోగించే ఇంధనం మరియు తృణధాన్యాల వాడకం వంటి వివరాలను సేకరిస్తారు. ఈసారి జనగణనలో మరో విశేషం ఏమిటంటే, పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దేశంలో సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించగా, దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఈ గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, నిధుల కేటాయింపులకు అత్యంత కీలకం కానున్నాయి.

## తెలంగాణలో ఈగల్, హైడ్రా తరహాలో మరో సరికొత్త వ్యవస్థ

హైదరాబాద్, మార్చి 30 (భారతశక్తి) : ఈగల్, హైడ్రా తరహాలో మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మాదక ద్రవ్యాలను నిరోధించడానికి 'ఈగల్', హైదరాబాద్ నహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం 'హైడ్రా' అనే వ్యవస్థలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో ఆహార కల్తీ నియంత్రణ కోసం సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సోమవారం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, హైడ్రా, ఈగల్ తరహాలో సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని తెలిపారు. రైతుల హక్కులను కాపాడేందుకు తాము కనీస మద్దతు ధర చట్టం తీసుకువచ్చామని గుర్తు చేశారు. పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని వాపోయారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

## రెండున్నర లక్షల మంది పేదలతో గృహ ప్రవేశం చేయించిన చంద్రబాబు

అమరావతి, మార్చి 30 (భారతశక్తి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి జిల్లా నాయుడుపేట వేదికగా రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేసి, వారితో గృహ ప్రవేశాలు చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత భారీ స్థాయిలో గృహ ప్రవేశాలు నిర్వహించడం ఇది రెండోసారి కావడం విశేషం. నేడు పంపిణీ చేసిన ఇళ్లలో 1,00,875 టిడ్కో (TIDCO) గృహాలు ఉండగా, మిగిలిన 1,50,018 సాధారణ గృహాలు ఉన్నాయి. గతేడాది నవంబర్ 12న ఇప్పటికే 3 లక్షల మందికి ప్రభుత్వం ఇళ్లను అందించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పేదల ముఖాల్లో ఆనందం చూస్తుంటే నా జన్మ ధన్యమైందనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిందని, పేదల పొట్ట కొట్టిందని మండిపడ్డారు. పేదలు మురికివాడల్లో కాదు, గౌరవప్రదమైన టిడ్కో ఇళ్లలో ఉండాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులు కట్టిన రూ. 174 కోట్లను మాయం చేశారని, ఆ మొత్తాన్ని తిరిగి 82 వేల కుటుంబాల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ సీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్ ఇస్తామని, దానికి రాయితీ కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్, బీసీలకు రూ. 20 వేల విద్యుత్ రాయితీ ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఏప్రిల్ నుంచి తాను స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని, సరిగా పనిచేయని అధికారులను ప్రజల ముందే నిలదీస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేల పనితీరుపై కూడా నిఘా ఉంటుందని, ప్రజల మెప్పు పొందని నాయకులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. టెక్నాలజీని ఉపయోగించి పెన్షన్ల పంపిణీని రియల్ టైమ్ మానిటర్ చేస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు వెల్లడించారు. భవిష్యత్తులో మహిళలకు రాజకీయంగానూ ఎక్కువ సీట్లు కేటాయిస్తామన్నారు. "హైదరాబాద్, చెన్నై కంటే గొప్పగా అమరావతిని నిర్మిస్తాం. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు.

## 'హేట్ స్పీచ్' బిల్లు ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (భారతశక్తి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకు ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఒక 'క్రూరమైన ఆయుధం' అని ఆయన అభివర్ణించారు. వాళ్లను విమర్శించే వారి నోళ్లు మూయించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ బిల్లు గనుక చట్టరూపం దాల్చితే, రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలకే పెను ముప్పు వాటిల్లుతుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినా, దానికోసం తీసుకొస్తున్న ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు. "ఈ బిల్లు రూపకల్పనను పరిశీలిస్తే, అమలు యంత్రాంగం వాస్తవ ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఉంది. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. బిల్లులో పొందుపరిచిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం', 'సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ నిర్వచనం, పరిమితులు లేవని ఆయన ఎత్తిచూపారు. ఈ పదజాలం ఉద్దేశపూర్వకంగానే అస్పష్టంగా ఉంచారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను విమర్శిస్తే, వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికే దేశంలో విద్వేష ప్రసంగాలను అరికట్టేందుకు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) వంటి చట్టాలు బలంగా ఉన్నాయని గుర్తుచేశారు. "ఇప్పటికే తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ కొత్త చట్టం తీసుకురావడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటి?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని, అణచివేత ధోరణిని విడనాడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

ఢిల్లీ, మార్చి 30 (భారతశక్తి) : విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి. రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సర్' (AVSAR) ఔట్‌లెట్లను కూడా తెరిచారు.

**అందుబాటు ధరలు.. స్థానిక రుచులు**

ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మేధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది. ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

## మాకు అవసరం లేదు
## మధ్యవర్తిత్వం వహిస్తానన్న పాకిస్థాన్‌కు ఇరాన్ షాక్

మార్చి 30 : అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించడానికి ప్రత్యక్ష చర్చలకు ఆతిథ్యం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ చేసిన ప్రకటనపై ఇరాన్ స్పందించింది. పాకిస్థాన్ నేతృత్వంలో జరిపే సంధి ప్రయత్నాలలో తమ ప్రమేయం ఏమీ లేదని ఇరాన్ స్పష్టం చేసింది. పాకిస్థాన్ ప్రయత్నాలకు ఇరాన్ నో చెప్పింది. ఈ మేరకు ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ సోమవారం 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది. అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని, కేవలం మధ్యవర్తుల ద్వారా అసమంజసమైన డిమాండ్లు మాత్రమే వచ్చాయని పేర్కొంది. పాకిస్థాన్ చర్చా వేదికలు వారి సొంత వ్యవహారమని, వాటిలో ఇరాన్ పాల్గొనలేదని కాన్సులేట్ స్పష్టం చేసింది. అమెరికా దౌత్యం ఎప్పటికప్పుడు మారుతుందని, మాటలు మారుస్తుందని ఆరోపించింది. కానీ ఈ విషయంలో తమ వైఖరి సుస్పష్టమని తెలిపింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వ ప్రకటన వారి సొంత ప్రణాళికలేనని తెలిపింది. యుద్ధం ముగింపు కోసం ఇస్తున్న పిలుపు స్వాగతించదగినదేనని, కానీ యుద్ధాన్ని ప్రారంభించింది ఎవరో గుర్తుంచుకోవాలని ఇరాన్ కాన్సులేట్ వ్యాఖ్యానించింది. రెండు రోజుల క్రితం ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో సౌదీ అరేబియా, ఈజిప్ట్, టర్కీ మంత్రులు సమావేశమైన విషయం తెలిసిందే. పశ్చిమాసియా యుద్ధం వల్ల ప్రపంచ దేశాలపై పడుతోన్న ప్రభావం గురించి వారు చర్చించారు. పాకిస్థాన్‌లో జరగబోయే ఇరాన్‌అమెరికా ప్రత్యక్ష చర్చలకు ఆ దేశాల మంత్రులు పూర్తి మద్దతు ఇచ్చినట్లు ఇషాక్ దార్ ప్రకటించారు. ఇరాన్, అమెరికాతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్ స్పందించింది.

## న్యాయవాదుల రక్షణ కోసం
## ప్రొటెక్షన్ బిల్లు: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, మార్చి 30 (భారతశక్తి) : తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకువస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. పట్టపగలు నడిరోడ్డుపై వారు హత్యకు గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతోనే వారిని హత్య చేశారని ఆరోపించారు. అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ బిల్లు తీసుకువస్తున్నట్లు చెప్పారు.

## శ్మశానంలో గ్యాస్ సిలిండర్ల దందా... హైదరాబాద్‌లో భారీ రాకెట్ గుట్టురట్టు

హైదరాబాద్, మార్చి 30 (భారతశక్తి) : హైదరాబాద్‌లో భారీ అక్రమ గ్యాస్ సిలిండర్ల రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. గల్ఫ్ యుద్ధం కారణంగా ఏర్పడిన ఎల్పీజీ కొరతను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఓ శ్మశాన వాటికలో అక్రమంగా నిల్వ ఉంచిన 414 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని, ఈ దందాకు పాల్పడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సోమవారం ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. నిందితులు అధిక లాభం కోసం సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. వారి నుంచి 11 రవాణా వాహనాలతో కలిపి మొత్తం రూ.21.88 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలీసుల కథనం ప్రకారం, శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ ఏజెన్సీ' నిర్వహిస్తున్న మహ్మద్ అమీర్ ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారి. ఇతను బంజారాహిల్స్‌లోని నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలోని శ్మశానంలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి, అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో గ్యాస్ ఏజెన్సీ యజమాని, డెలివరీ బాయ్స్, డ్రైవర్లు, కార్మికులు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో వివిధ కేజీల బరువున్న సిలిండర్లు, డీసీఎం వ్యాన్లు, బొలెరో వాహనాలు, ఆటోలు ఉన్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దక్షిణ సూడాన్‌లో నరమేధం... 70 మంది మృతి

మార్చి 30 (భారతశక్తి) : దక్షిణ సూడాన్‌లో మారణహోమం చోటుచేసుకుంది. రాజధాని జుబాకు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న జెబెల్ ఇరాక్ బంగారు గని వద్ద గుర్తుతెలియని సాయుధ దుండగులు జరిపిన దాడిలో 70 మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య 85 వరకు ఉండొచ్చని కొన్ని అనధికారిక వర్గాలు చెబుతున్నాయి. ప్రాథమిక నివేదికల ప్రకారం, బంగారు గని వద్ద తలెత్తిన ఒక వివాదమే ఈ దాడికి కారణమైంది. సాయుధ దుండగులు ఒక్కసారిగా పౌరులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అనేక మంది తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రాంతంలోని గనిపై దాడి జరగడం ఇది రెండోసారి. దక్షిణ సూడాన్‌లో 2018 శాంతి ఒప్పందం ఉల్లంఘనలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇలాంటి హింసాత్మక ఘటనలు సాధారణమయ్యాయని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# గద్దెనెక్కింది ఉద్యమకారులను బలి తీసుకోవడానికే ..నా ?

* **ఉద్యమకారుల అరెస్టులపై కప్పాటి పాండురంగా రెడ్డి ఆగ్రహం**
* **హామీలు ఏమయ్యాయని నిలదీత.. ప్రజాపాలన అంటే ఇదేనా?**

రంగారెడ్డి, : మార్చి 30 (భారతశక్తి) : తెలంగాణ తెచ్చినోళ్లను ఇళ్లకు వెళ్లి అరెస్టు చేయడం, గృహనిర్బంధాలు చేయడమేనా మీరు చెప్పిన 'ప్రజా పాలన'? అని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, అనైతిక చర్యలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం దారుణమని మండిపడ్డారు.

* **అర్ధరాత్రి అరెస్టులు దేనికి సంకేతం?**

"తెల్లవారుజామునే ఉద్యమకారుల ఇళ్లపై పడి, వారిని భయాందోళనకు గురిచేస్తూ అరెస్టులు చేయడం దేనికి సంకేతం? ప్రజల గొంతు నొక్కితే పాలన సాగుతుందని అనుకోవడం మీ భ్రమ" అని పాండురంగా రెడ్డి హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే, అరెస్టులతో అణచివేయాలని చూడటం ప్రభుత్వ అసమర్థతేనని విమర్శించారు.

* **పదవులు అనుభవిస్తూ.. పోరాడినోళ్లపై ప్రతాపమా?**

అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాట ఫలితంగానే నేడు ముఖ్యమంత్రి, మంత్రులు పదవుల్లో కూర్చున్నారని ఆయన గుర్తు చేశారు. "నాడు ఉద్యమకారుల భుజాల మీద ఎక్కి పదవులు పొంది, నేడు అదే ఉద్యమకారులను జైల్లో పెట్టించడం ఎంతవరకు సమంజసం? ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి" అని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మొండివైఖరి వీడి, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే భవిష్యత్తులో ఉద్యమకారుల నుంచి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



# బీజేపీ అక్రమాలను తరిమికొడదాం

* **యువజన కాంగ్రెస్ శ్రేణులకు శివంత్ రెడ్డి పిలుపు**

మహబూబ్‌నగర్, మార్చి 30 (భారత శక్తి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ఎండగట్టాలని, రాబోయే రోజుల్లో యువజన కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జ్ శివంత్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

**పల్లె పల్లెనా పార్టీ బలోపేతం:**

ఈ సందర్భంగా శివంత్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో యువజన కాంగ్రెస్ కార్యకలాపాలను మరింత ఉధృతం చేయాలని సూచించారు. ముఖ్యంగా మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను వేసి పార్టీని పటిష్టం చేయాలన్నారు. కేంద్ర సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యువత పోరాడాలని, బీజేపీ అక్రమాలను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.

**భారీగా తరలివచ్చిన శ్రేణులు:**

జిల్లా కార్యవర్గ సమావేశానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అవేజ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. వారితో పాటు వివిధ నియోజకవర్గ, మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు మరియు యువజన కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆఫీసర్స్ కాలనీ పోరాటం గెలిచింది!

* **30 ఏళ్ల కబ్జా కోరల నుంచి పార్కుకు విముక్తి**
* **తప్పుడు ఎల్ఆర్ఎస్‌లు.. నకిలీ పత్రాలకు చెక్**
* **కాలనీవాసులను సన్మానించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**



హైదరాబాద్, మార్చి 30 (భారతశక్తి) : అది ఒకట్రెండు ఏళ్ల పోరాటం కాదు.. ఏకంగా మూడు దశాబ్దాల యుద్ధం. బడా కబ్జాదారులు, అండగా నిలిచిన కొందరు అధికారులు.. వెరసి పార్కు స్థలాన్ని మింగేయాలని చూశారు. కానీ, ఆ రిటైర్డ్ ఉద్యోగుల పట్టుదల ముందు అక్రమార్కులు మోకరిల్లక తప్పలేదు. ఆర్కే పురం ఆఫీసర్స్ కాలనీలో 3 వేల గజాల పార్కు స్థలం ఎట్టకేలకు కాలనీవాసుల వశమైంది. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన స్థానికులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించారు.

**అధికారులను బురిడీ కొట్టించి..**

1968లో ఏర్పడిన ఈ కాలనీలో పార్కు కోసం కేటాయించిన స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. 1997 నుంచే ఈ వివాదం మొదలైంది. కోర్టులు 'ఇది పార్కు స్థలమే' అని తేల్చి చెప్పినా, అక్రమార్కులు వెనక్కి తగ్గలేదు. సిబ్బందిని మేనేజ్ చేసి 2008లో ఎల్ఆర్ఎస్ (LRS) కూడా పొందారు. 2011లో ఏకంగా నిర్మాణ అనుమతులు తెచ్చుకుని జేసీబీలతో రంగంలోకి దిగారు. కానీ కాలనీవాసులు ప్రాణాలకు తెగించి అడ్డుకున్నారు.

**హైడ్రా ఎంట్రీతో సీన్ రివర్స్**

ఏళ్ల తరబడి కోర్టు మెట్లు ఎక్కి అలసిపోయిన స్థానికులు.. ఈ ఏడాది ఫిబ్రవరి 10న 'హైడ్రా' ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా యంత్రాంగం.. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. కబ్జాదారులు తప్పుడు పత్రాలతో అధికారులను బురిడీ కొట్టించారని తేల్చింది. హైకోర్టు స్టే ఎత్తివేయగానే, ఈ నెల 25న హైడ్రా బలగాలు 'సర్జికల్ స్ట్రైక్' తరహాలో ఆక్రమణలను కూల్చేశాయి. ఫెన్సింగ్ వేసి బోర్డులు పాతాయి.

**"మీరే మాకు స్ఫూర్తి"**

"సాధారణంగా మేం ఆక్రమణలు తొలగిస్తే జనం వచ్చి మమ్మల్ని సన్మానిస్తారు. కానీ, మీరు చేసిన పోరాటం సామాన్యమైంది కాదు. రిటైర్మెంట్ తర్వాత కూడా పర్యావరణం కోసం, సమాజం కోసం ఇంతలా పోరాడటం గొప్ప విషయం. అందుకే మిమ్మల్ని గౌరవించుకుంటున్నాం" అని కమిషనర్ రంగనాథ్ కొనియాడారు.

**అక్రమ అనుమతులు రద్దు**

కేవలం ఆక్రమణలు తొలగించడమే కాకుండా.. కబ్జాదారులకు ఇచ్చిన ఎల్ఆర్ఎస్, నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు హైడ్రా లేఖలు రాసింది. దీంతో మూడు దశాబ్దాల అక్రమ దందానికి తెరపడింది. తమ పార్కు తమకు దక్కడంతో కాలనీవాసులు సంబరాలు చేసుకుంటున్నారు.

# ఆలయానికి దాతలు ఇచ్చిన విరాళాల దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు



ఎల్బీనగర్, మార్చి 30 (భారత శక్తి): దేవాలయ అభివృద్ధికి దాతలు ఇచ్చిన విరాళాలు దేవాలయ ధర్మకర్తలు తమ జేబులో వేసుకొని స్వంత ఖర్చులకు వినియోగించుకుంటున్నారని కర్మన్ ఘాట్‌లోని పవిత్ర ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. ఆలయ అభివృద్ధి కోసం భక్తులు సమర్పించిన విరాళాలను కొంతమంది ధర్మకర్తలు అభివృద్ధి పనులకు వినియోగించకుండా, తమ స్వంత అవసరాలకు వాడుకున్నట్లు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి.ఈ విషయంపై భక్తులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా, కొంతమంది ధర్మకర్తలు ఆలయ సిబ్బందిపై ఆజమాయిషీ చలాయిస్తూ, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.ఇద్దరు ధర్మకర్తలు ఆలయంలో పార్కింగ్ నిర్వహణ, కొబ్బరి చిప్పల సేకరణ వంటి వ్యవహారాల్లో కూడా బెదిరించి లంచాలు తిన్నట్లు, డైరీలు ప్రింట్ చేయిస్తామని అర్చకులపై ఒత్తిడి తీసుకొచ్చి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం.ఈ పరిణామాలు ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, ఈ విషయంపై ఫిర్యాదు ఇచ్చిన సదరు స్వామి భక్తులు ఫిర్యాదుపై స్పందించిన ఆలయ ఈఓ లావణ్య, ఈ అంశం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని మీడియాకు వెల్లడించారు.



# న్యాయవాదులకు ప్రొటెక్షన్ యాక్ట్

## : హర్షించిన బార్ అసోసియేషన్ సభ్యులు

ఎల్బీనగర్, మార్చి 30 (భారత శక్తి): న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు గోకుల్ రామారావు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా న్యాయవాదులపై వివిధ రకాల దాడులు, హత్యలు, హత్యాయత్నాలు కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు తమకు రక్షణ చట్టం కావాలని నిరంతరం పోరాటం కొనసాగించారని పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణ చట్ట అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో చట్టాన్ని ప్రవేశపెట్టడం ఆనందకరమైన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు.రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు విప్లవ రెడ్డి మాట్లాడుతూ, న్యాయవాదుల దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చుతూ ప్రభుత్వం ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావడం హర్షణీయమని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శి వోద్యారపు రవికుమార్, ఉపాధ్యక్షుడు బొడ్డు రమేష్ కుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులందరికి అండగా ఉంటాను

**: ఐజేయు వైస్ ప్రెసిడెంట్ వై. నరేందర్ రెడ్డి**



ఎల్బీనగర్, మార్చి 30 (భారత శక్తి): జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటాననీ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన వై. నరేందర్ రెడ్డి అన్నారు. ఐజేయు జాతీయ ఉపాధ్యక్షులు వై. నరేందర్ రెడ్డిని ఎల్బీనగర్ వనస్థలిపురంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రంగారెడ్డి యూనిట్, ఎల్బీనగర్ నియోజకవర్గ జర్నలిస్టుల తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమానికి ఐజేయు నిరంతరం పోరాడుతుందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై జాతీయ స్థాయిలో గలమెత్తుతామని అన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యవర్గంలో రంగారెడ్డి జిల్లాకు పెద్దపీట దక్కిందన్నారు. నరేందర్ రెడ్డి జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావటం మనకు గర్వకారణామన్నారు.జిల్లా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సలీమ్ పాషా, మేకల సత్యనారాయణలు మాట్లాడుతూ, జాతీయ కమిటీలో రంగారెడ్డి జిల్లాకు అత్యంత ప్రముఖమైన స్థానం కల్పించిన ఐజేయూ నాయకత్వనికి ధన్యవాదములు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జాతీయ కౌన్సిల్ సభ్యులకు, వివిధ రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ కుమార్, శివకుమార్, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, ఆరోగ్య శిబిరం కన్వీనర్ రాచ శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్యామ్ ప్రసాద్, బెల్లి మల్లేష్ యాదవ్, సీనియర్ జర్నలిస్టులు కీసరి మల్లేష్ గౌడ్, వెంపటి గణేష్, శ్రీనివాస్, రఫీ, చంద్రశేఖర్ గౌడ్, రాజశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





**హనుమాన్ జయంతి శోభాయాత్ర నిర్వహణకు సంబంధించిన అన్నీ విభాగాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ ) ఎల్బీనగర్ కోటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎల్బీనగర్ కృష్ణయ్య, ఏసీపీ వనస్థలిపురం కాశిరెడ్డి, ఏసీపీ ట్రాఫిక్ నవీన్ రెడ్డి, సీఐలు సైదులు, వినోద్ కుమార్, శ్రీశైలం యాదవ్,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. శోభాయాత్రను ఎల్బీనగర్ జోన్ పరిధిలో ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు ఇచ్చారు..**

**ఎల్బీనగర్, మార్చి 30 (భారత శక్తి):**

# ఓ మగువ నీకు వందనం

మహిళా అంటే ఒక శక్తి
సృష్టికి మూలం మహిళ
మహిళతోనే మనుగడ
మరువలేము నీ త్యాగం!!
ఆమె సహనానికి మారుపేరు
అక్క చెల్లి అమ్మగా తనదైన పాత్ర
మహిళా నీకు శతకోటి వందనాలు

ఆత్మగాళ్ళు మనసుకలిగిన మహిళ!!
ఆమె ఒక అమ్మ ఒక నాన్న
ఆమె పొద్దుతో పోటీ పడుతుంది
కాలంతో పోటీ పడుతుంది ఆమె
ఈ జగతిన సరిలేరు నీకెవ్వరు!!
ప్రేమ త్యాగం సహనం ఆమె
మగువ మనుగడకే ప్రాణం పోసేది



అవసరానికి ఆసరాగా నిలిచే ధీరత్వం
భూమాతకు ఉండే సహనం ఆమెది!!

అలుపెరుగని ఓర్పు ఆమెది
నిరంతర శ్రమజీవి ఆమె
ఓ మగువా నీకు వందనం
ఆమెతోనే మన జీవన ప్రయాణం!!

**రచన:**
**దేవులపల్లి రమేశ్**
**కలం: వామిక శ్రీ వర్ష**
**సిద్దిపేట, నంగునూర్**
**చరవాణి :9963701294**

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.